విలేకరులు కావలెను
పెన్ సత్తా తెలుగు దినపత్రిక
ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.
ఫోన్ నెం : 9885315759

RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు..

PEN SATTA Telugu Daily



సంపుటి : 4 | సంచిక :67 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | గురువారం 30 జూలై 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool

# ప్రపంచ స్థాయి మౌలిక వసతులు

- రాష్ట్రంలో ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్ల తయారీకి తైవాన్ కంపెనీల ఆసక్తి
- సీఎం చంద్రబాబుతో భేటీ
- డెల్టా ఎలక్ట్రానిక్స్, బెన్‌క్యూ, ఇతర సంస్థల ప్రతినిధులతో సీఎం చర్చలు
- రాష్ట్రంలోని మౌలిక వసతులు, లాజిస్టిక్స్ గురించి వివరించిన సీఎం
- సత్వర అనుమతులు, పూర్తి ప్రోత్సాహం అందిస్తామన్న చంద్రబాబు




**అమరావతి**

రాష్ట్రంలో ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్ల తయారీకి తైవాన్ కంపెనీలు ఆసక్తి చూపాయి. ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్లు సహా అధునాత తయారీ, సాంకేతిక రంగాల్లో ఏపీతో భాగస్వామ్యాన్ని మరింత పెంచుకునే దిశగా తైవాన్ పారిశ్రామిక ప్రతినిధుల బృందం సీఎం చంద్రబాబుతో భేటీ అయ్యింది. ఎలక్ట్రానిక్స్, సెమికండక్టర్లు, ఐటీ, అడ్వాన్స్‌డ్ మాన్యుఫాక్చరింగ్ సహా ఎగుమతి ఆధారిత పరిశ్రమలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడిదారులకు విధానపరమైన స్థిరత్వం, వేగంగా అనుమతులు జారీ చేయటంతో పాటు పూర్తి స్థాయి ప్రోత్సాహాన్ని అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. తైవాన్ కంపెనీలు, పరిశ్రమలకు చెందిన ఉన్నతస్థాయి ప్రతినిధుల బృందం రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్?లతో వివిధ అంశాలపై చర్చలు జరిపింది. తైవాన్?కు చెందిన డెల్టా ఎలక్ట్రానిక్స్, బెన్ క్యూ,

వివరాలు 2లో..



## యాంటీ పేపర్ లీక్ బిల్లుకు లోక్‌సభ గ్రీన్ సిగ్నల్

- విపక్షాల నినాదాల మధ్య ఆమోదం
- మూజువాణి ఓటుతో యాంటీ పేపర్ లీక్ బిల్లుకు ఆమోదం
- బిల్లును జేపీసీకి పంపాలని డిమాండ్ చేసిన కొందరు ఎంపీలు
- ఎంపీలు ప్రతిపాదించిన సవరణలు వీగిపోయినట్లు ప్రకటించిన స్పీకర్ ఓం బిర్లా



## విద్యార్థులపై దాడులకు అమిత్ షానే కారణం-

- వారికి క్షమాపణ చెప్పను: రాహుల్ గాంధీ
- సభలో నాకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదు
- విద్యార్థులపై దాడికి అమిత్‌షాయే బాధ్యుడు
- రాహుల్‌గాంధీ ఆరోపణలు

## రైతులకు అండగా ఉంటున్నాం

తప్పుడు స్టేట్‌మెంట్లతో పొగాకు రైతులకు నష్టం చేయొద్దు

జగన్‌కు మంత్రి అచ్చెన్నాయుడు హితవు

పొగాకు రైతులను ప్రభుత్వం ఆదుకుంటున్న సమయంలో నెగిటివ్ స్టేట్‌మెంట్లతో మరింత నష్టం చేయొద్దన్న మంత్రి అచ్చెన్నాయుడు




## ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్ విడుదలకు పగడ్బందీ ప్రణాళిక



**3,168 ఉద్యోగాలకు సెప్టెంబర్‌లో, 5,369 ఉద్యోగాలకు అక్టోబర్‌లో నోటిఫికేషన్**

**జాబ్ క్యాలెండర్ -2026పై మంత్రుల బృందంతో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఉన్నత స్థాయి సమీక్ష**

**అమరావతి**

నిరుద్యోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్ విడుదల పకడ్బందీగా ఉండాలని మంత్రి లోకేశ్? అధికారులను ఆదేశించారు. ఉండవల్లి సీఎం క్యాంపు కార్యాలయంలో జాబ్ క్యాలెండర్-2026పై మంత్రుల బృందంతో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. గ్రూప్-1కు సంబంధించి గతంలో సూచించిన పోస్టుల సంఖ్యను పెంచాలని అధికారుల్ని ఆదేశించారు. జాబ్ కేలండర్-2026 ప్రకారమే 4 దశల్లో మొత్తం 10 వేల 60 ఉద్యోగాలు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే మొదటి దశ కింద వివిధ వర్సిటీల్లో 15 వందల 23 అధ్యాపక పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ప్రక్రియ ముగిసింది.

వివరాలు 2లో..



## 2028 నాటికి ఈవీ ఎయిర్ అంబులెన్స్, ట్యాక్సీలు

- రన్‌వే లేకుండానే టేకాఫ్, ల్యాండింగ్!
- నగరాల్లో అత్యవసర రోగులను రక్షించేందుకు ఎలక్ట్రిక్ ఎయిర్ అంబులెన్స్
- హెలికాప్టర్ల కంటే తక్కువ ఖర్చు
- హెలిప్యాడ్‌తో పనిలేకుండా ఇళ్ల పైకప్పుల పైనే ల్యాండింగ్?

## స్థానిక సంస్థల ఎన్నికలపై బీజేపీ స్ట్రాటజీ

నాలుగు జోన్లలో సీనియర్లకు బాధ్యతలు

స్థానిక సంస్థల ఎన్నికలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న భారతీయ జనతా పార్టీ

ప్రతి జోన్‌కు సీనియర్ నాయకులకు బాధ్యతలు



**అమరావతి**

రాష్ట్రంలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న భారతీయ జనతా పార్టీ ఎన్నికల సన్నాహాలను ముమ్మరం చేసింది. పార్టీని గ్రామస్థాయి వరకు బలోపేతం చేయడంతో పాటు ఎన్నికల నిర్వహణ, సమన్వయం, వ్యూహరచన కోసం రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. ఉత్తరాంధ్ర, గోదావరి, కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాలను నాలుగు జోన్లుగా విభజించి, ప్రతి జోన్‌కు సీనియర్ నాయకులకు బాధ్యతలు అప్పగించారు. ఎన్నికల నిర్వహణ, సంస్థాగత సమన్వయం, క్షేత్రస్థాయి కార్యాచరణ, అభ్యర్థుల ఎంపిక, పార్టీ శ్రేణులతో నిరంతర సమన్వయం వంటి అంశాలను కమిటీ పర్యవేక్షించనుంది. ప్రత్యేక కమిటీలో రాష్ట్ర ఆరోగ్య మంత్రి

వివరాలు 2లో..

# యాంటీ పేపర్ లీక్ బిల్లుకు లోక్‌సభ గ్రీన్ సిగ్నల్

యాంటీ పేపర్ లీక్ చట్ట సవరణ బిల్లును లోక్‌సభ ఆమోదించింది. 'వుయ్ వాంట్ జస్టిస్' అనే విపక్షాల నినాదాల మధ్య మూజువాణి ఓటుతో బిల్లుకు ఆమోదం తెలిపింది. బిల్లును జేపీసీకి పంపాలని కొందరు ఎంపీలు డిమాండ్ చేసినా, వారు ప్రతిపాదించిన సవరణలు వీగిపోయినట్లు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. అనంతరం స్పీకర్ ఓం బిర్లా లోక్‌సభను గురువారానికి వాయిదా వేశారు. పేపర్ లీక్‌లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇందుకు సంబంధించి బిల్లులో నిబంధనలు రూపొందించామని తెలిపింది.



**రాహుల్‌గాంధీ అప్రజాస్వామిక భాషను వాడారు: జితేంద్రసింగ్**

అంతకుముందు పీఎంవో సహాయమంత్రి జితేంద్రసింగ్ యాంటీ పేపర్ లీక్ బిల్లుపై జరిగిన చర్చకు సమాధానం ఇచ్చారు. చర్చ సందర్భంగా విపక్షాలు చేసిన ఆరోపణలను ఆయన తిప్పికొట్టారు. ఇప్పటివరకు 152 సార్లు పేపర్ లీక్‌లు జరిగాయన్న కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకాగాంధీ ఆరోపణలకు ఆధారమే లేదని అన్నారు. ప్రతిపక్ష నేత రాహుల్ వ్యాఖ్యలు ఆశ్చర్యం కలిగిస్తున్నాయని జితేంద్రసింగ్ అన్నారు. రాహుల్ వ్యాఖ్యలు చూస్తే సభా సంప్రదాయాలపై ఆయనకు అవగాహన లేదని రుజువవుతోందన్నారు. రాహుల్‌గాంధీ అప్రజాస్వామిక భాష వాడారని దుయ్యబట్టారు.

"ప్రతిపక్షాలను చూస్తుంటే ఈ దృశ్యం చాలా నిరాశ కలిగించేలా ఉంది. ఇంతటి ముఖ్యమైన బిల్లుపై చర్చ జరుగుతున్నప్పుడు ప్రధాని మోదీ చిత్తశుద్ధితో, ఎంతో సున్నితత్వంతో ఈ బిల్లును సభలోకి తీసుకొచ్చినప్పుడు సీరియస్‌గా చర్చించి, సలహాలు ఇవ్వడానికి బదులు రాజకీయం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రతిపక్ష నేత ప్రవర్తన చూసి నేను ఆశ్చర్యపోతున్నాను. రాహుల్ గాంధీ అప్రజాస్వామిక భాష వాడారు. ఆయన వాడిన పదాలు సభా సంప్రదాయాలకు విరుద్ధమైనవి. అంతేకాదు అది ఎంతటి అన్‌పార్లమెంటరీ పదమంటే ఆ పదాన్ని నేను నా నోటితో ఉచ్చరించలేను. ఒకవేళ ఏ వ్యక్తైనా లేదా గౌరవసభ్యుడైనా తనను తాను 'ఇడియట్' అనుకున్నప్పటికీ, ఆ పదాన్ని ఇక్కడ వాడకూడదు. సభ వెలుపల వెళ్లి అనవచ్చు కానీ, సభలో అనటానికి వీల్లేదు. ప్రతిపక్ష నేతకు ఇలాంటి పార్లమెంటరీ నిబంధనల గురించి అవగాహన లేకపోవడం నాకు ఆశ్చర్యం కలిగిస్తోంది."

**కాల్పుల ఆదేశాలను మంత్రి ఇవ్వరు- మేజిస్ట్రేట్ ఇస్తారు: జితేంద్రసింగ్**

కాల్పుల ఆదేశాలపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను జితేంద్ర సింగ్? ఖండించారు. "కాల్పుల ఆదేశాలను మంత్రి ఇవ్వరు మేజిస్ట్రేట్ ఇస్తారు. అసలు కాల్పులు జరగనే లేదు. బాష్పవాయువు ప్రయోగించారు. కాల్పులు జరగకపోతే ఆదేశాలు ఇచ్చారనే మాటకు అర్థం లేదు. హోంమంత్రి విదేశాలకు వెళ్లారని ఆరోపణలు చేస్తున్నారు. హోంమంత్రి విదేశాలకు వెళ్లినట్లు మాకెలాంటి సమాచారం లేదు. అవాస్తవాలు చెప్పి సభ నుంచి వెళ్లడం బాధ్యతాయుతం కాదు. ప్రధాని నివాసం ముందు బైఠాయించి నిరసన తెలపడం సమంజసం కాదు. ప్రధాని నివాసం ముందు నిరసన సముచితం కాదని చెప్పినా పట్టించుకోలేదు. 150 సార్లు పేపర్లు లీక్ అయ్యాయని ప్రియాంక గాంధీ ఆరోపించారు. అన్నిసార్లు పేపర్ లీక్ అయ్యాయనేందుకు ఎలాంటి ఆధారాలు లేవు. 150 సార్లు పేపర్ లీక్ వల్ల 750 కోట్ల విద్యార్థులపై ప్రభావం పడిందన్నారు. దేశ జనాభాను ప్రపంచ జనాభాతో పోల్చి ప్రియాంక చెప్పారు. ఎన్‌డీఏ హయాంలో 30 శాతం మేర ఉన్నత విద్యాలయాలు పెరిగాయి. ఎన్‌డీఏ హయాంలో 763 యూనివర్సిటీల నుంచి 1293కి పెంచాం." అని జితేంద్ర సింగ్ అన్నారు.

**గరిష్ఠంగా 10 ఏళ్ల వరకు జైలు శిక్ష**

పబ్లిక్ ఎగ్జామ్స్ సవరణ బిల్లు-2026ను ఇంతకుముందు కేంద్రం ప్రతిపాదించింది. పరీక్షల్లో అక్రమ పద్ధతులను అవలంబిస్తే కనీసం 5 ఏళ్ల నుంచి గరిష్ఠంగా 10 ఏళ్ల వరకు జైలు శిక్ష విధించేలా చట్టంలో మార్పులు ప్రతిపాదించింది. జరిమానాను 10 లక్షల నుంచి 50 లక్షలకు పెంచేందుకు ప్రతిపాదన చేసింది. సర్వీస్ ప్రొవైడర్స్‌కి విధించే జరిమానాను కోటి నుంచి 5 కోట్లకు పెంచుతూ నిబంధన చేర్చింది. పరీక్షల నుంచి సర్వీస్ ప్రొవైడర్స్‌ని నిషేధించే కాలాన్ని 4 ఏళ్ల నుంచి 8 ఏళ్లకు పొడిగిస్తూ ప్రతిపాదన చేసింది. నేరం రుజువైతే, కంపెనీ డైరెక్టర్లు లేదా ఉన్నతాధికారులకు కనీసం 5 ఏళ్ల జైలు శిక్ష, 5 కోట్ల వరకు జరిమానా విధించనున్నారు. వ్యవస్థీకృత పరీక్షా కుంభకోణాలకు సంబంధించి శిక్ష, జరిమానాల్లో కూడా కేంద్రం మార్పులు ప్రతిపాదించింది. కనీస శిక్షను 5 ఏళ్ల నుంచి 7 ఏళ్లకు, కనీస జరిమానాను కోటి నుంచి 10 కోట్లకు పెంచింది. పరీక్షా కుంభకోణాలపై దర్యాప్తు చేయడానికి ప్రత్యేక టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. పోలీసులు, కేంద్ర దర్యాప్తు సంస్థ లేదా టాస్క్ ఫోర్స్ మొత్తం దర్యాప్తును 2 నెలల్లోపు పూర్తి చేసేలా మార్పులు ప్రతిపాదించింది.

## 'ఎన్నిసార్లు చెప్పాలి'

# జమ్మూకశ్మీర్, లద్ధాఖ్ భారత్‌లో అంతర్భాగమే

జమ్మూకశ్మీర్‌పై పదే పదే తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నవారికి భారత విదేశాంగ మంత్రిత్వశాఖ (ఎంఈఏ) బుధవారం స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చింది. ఓ ప్రముఖ అమెరికన్ టీవీ షోలోని ఒక క్యారెక్టర్ వైరల్ మీమ్‌ను షేర్ చేస్తూ, "నేను మీకు ఇది ఎన్ని సార్లు వివరించాలి" అనే క్యాప్షన్‌ను జతచేసింది. ఈ విధంగా మొత్తం జమ్మూకశ్మీర్, లద్ధాఖ్ ప్రాంతాలు భారతదేశంలో అంతర్భాగాలే అని మరోసారి స్పష్టం చేసింది. భారత విదేశాంగ శాఖ తన ఇన్?స్టా పోస్టులో "జమ్మూకశ్మీర్?, లద్ధాఖ్? కేంద్రపాలిత ప్రాంతాలపై పదేపదే అబద్ధాలు చెబుతూ, తప్పుడు ప్రచారాలు చేస్తే, మా స్పందన ఇలానే ఉంటుంది" అని తేల్చిచెప్పింది.




"ప్రస్తుతం పాకిస్థాన్? అక్రమణలో ఉన్న ప్రాంతాలతో సహా భారత్?లో ఉన్న జమ్మూకశ్మీర్?, లద్ధాఖ్?లు భారతదేశంలో విభాజ్య అంతర్భాగాలు. ప్రస్తుతం పీవోకేలో నిర్వహిస్తున్న ఎన్నికల ప్రక్రియ, పాకిస్థాన్ తన అక్రమ ఆక్రమణను కప్పిపుచ్చుకోవడానికి, ఆ ప్రాంతంలో జరుగుతున్న ఘోరమైన మానవ హక్కుల ఉల్లంఘనలను కప్పిపుచ్చేందుకు చేస్తున్న ప్రయత్నం తప్ప మరొకటి కాదు. ఇస్లామాబాద్ దశాబ్దాలుగా చేస్తున్న వ్యవస్థాగత ఆర్థిక దోపిడీ, ప్రాథమిక హక్కుల నిరాకరణ, పరిపాలనాపరమైన అణచివేతకు ప్రత్యక్ష పర్యవసానమే పీవోకేలో జరుగుతున్న భారీ నిరసనలు."

**ఫ్యాక్ట్ చెక్?**

భారత విదేశాంగ శాఖ తన ఎక్స్? ఖాతాలో ఇదే సందేశాన్ని షేర్ చేస్తూ, ఒక నెటిజన్ చేసిన తప్పుడు వాదనలకు గట్టి కౌంటర్ ఇచ్చింది. ఇంతకీ ఏం జరిగిందంటే? ఓ నెటిజన్? తన పోస్టులో జమ్మూకశ్మీర్ గురించి తప్పుడు వాదనలు చేశాడు. "జమ్మూకశ్మీర్?, లద్ధాఖ్ భారత్?లో అంతర్భాగాలు కావు. ఐరాస తీర్మానాల ప్రకారం, ఆ మొత్తం ప్రాంతం వివాదాస్ప భూభాగం. ఆర్టికల్ 370ని రద్దు చేస్తూ, భారత్? 2019లో ఆ ప్రాంతాన్ని అక్రమంగా విలీనం చేసుకుంది. అలాకాకుండా పాక్ అధీనంలోని జమ్మూకశ్మీర్?కు? పాక్షిక స్వయంప్రతిపత్తిని కలిగి ఉంది. కశ్మీరీలకు స్వయం నిర్ణయాధికారాన్ని నిరాకరిస్తూ, ఏజేకే ఎన్నికలను నామమాత్రపు ఎలక్షన్స్? అనడం పూర్తిగా కపటత్వం. కేవలం నియంత్రణ రేఖ (ఎల్?వోసీ)కి భారత్ వైపు ఉన్న ప్రాంతంలోనే బలవంతపు ఆక్రమణ ఉంది" అని అన్నాడు.

ఈ వాదనలను భారత విదేశాంగ శాఖ పూర్తిగా తిరస్కరించింది. పాకిస్థాన్? ఆక్రమణలో ఉన్న భూభాగాలన్నీ భారత్?తో విడదీయరాని భాగాలను స్పష్టం చేసింది. ప్రస్తుతం పీఓకేలో పాక్ నిర్వహిస్తున్న ఎన్నికలు కేవలం కంటితుడుపు చర్యలేనని పేర్కొంది. పీఓజేకేలోని రావల్?కోట్?, మిర్పూర్? ప్రాంతాల్లో ప్రాథమిక హక్కుల కోసం జరుగుతున్న నిరసనలపై పాకిస్థాన్ భద్రతాదళాలు జరిపిన కాల్పుల్లో గత రెండు రోజుల్లో పలువురు మరణించినట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో ఎంఈఏ ఈ విధంగా ఘాటుగా స్పందించింది.

**పీఓకేలో నిరసనలు**

మానవ హక్కులను నిరాకరించడానికి వ్యతిరేకంగా పీఓకే ప్రజలు గత 52 రోజులుగా నిరసనలు చేస్తున్నారు. అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలని, నిరసనకారులపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని, ఇతర డిమాండ్లను అంగీకరించాలని డిమాండ్ చేస్తున్నారు. జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (జేఏఏసీ), అధికారుల మధ్య సోమవారం జరిగిన చర్చలు విఫలం కావడంతో, వేలాది మంది ప్రజలు ముజఫరాబాద్? వైపు మార్చ్?కు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో రావల్?కోట్?లో పాక్ దళాలు జరిపిన విచక్షణారహిత కాల్పులను ఖండించారు. రావల్?కోట్?లో పాక్ దళాలు జరిపిన కాల్పుల్లో సుమారు 14 మంది మరణించగా, చాలా మంది తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. దీనితో జూన్? 5 నుంచి జులై 28 మధ్య మరణించిన నిరసనకారుల సంఖ్య 67కు చేరిందని జేఏఏసీ చెప్పింది. మరణించిన వారిని 'అమరవీరులు'గా పేర్కొంటూ, తమ ఉద్యమాన్ని కొనసాగిస్తామని ప్రతిజ్ఞ చేసింది. మరోవైపు పాక్ నిర్వహిస్తున్న ఎన్నికలు ప్రజా సంకల్పాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని పీఓజేకే నాయకులు ఆరోపిస్తున్నారు. అరెస్టులు, బెదిరింపులు, భారీ భద్రతా మోహరింపుల ద్వారా అధికారులు ప్రజలను భయపెడుతున్నారని అన్నారు. మరోవైపు రావల్?కోట్?లో నిరసనకారులపై పాక్ భద్రతా దళాలు జరిపిన మారణకాండపై తక్షణమే, స్వతంత్ర, పారదర్శక విచారణకు ఆదేశించాలని అమ్నెస్టీ ఇంటర్నేషనల్? పాకిస్థాన్? అధికారులను కోరింది.

# విద్యార్థులపై వేధింపులు ఆగకపోతే మళ్లీ ఉద్యమం

నీట్ యూజీ 2026 ప్రశ్నాపత్రం లీక్ వ్యవహారంపై నిరసనలు తెలిపిన విద్యార్థులపై ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలు వెంటనే నిలిపివేయాలని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) డిమాండ్ చేసింది. ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోకపోతే త్వరలోనే మరోసారి దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని ప్రారంభిసా మని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే హెచ్చరించారు. దిల్లీ విమానాశ్రయం వద్ద బుధవారం మీడియాతో మాట్లాడు తూ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. తమ భవిష్యత్తు, హక్కుల కోసం శాంతియుతంగా నిరసన తెలిపిన విద్యార్థులపై లాఠీచార్జ్, పెలెట్ గన్స్ వంటి చర్యలు తీసుకోవడం తీవ్రంగా ఖండించారు. జులై 20న జరిగిన నిరసనల సందర్భంగా విద్యార్థులపై బలప్రయోగం జరిగిందని అభిజీత్ దీప్కే ఆరోపించారు. వారిని ఉగ్రవాదుల మాదిరిగా పెల్లెట్ గన్స్?తో లక్ష్యంగా చేసుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. ప్రభుత్వం ఇలాంటివి చేయకూడదని, విద్యార్థులు తమ భవిష్యత్, హక్కుల కోసం పోరాడుతున్నారని అన్నారు. వారిపై ఇలాంటి చర్యలు తీసుకోవడం తగదని తెలిపారు. ఇలాగే వేధించడం [illegible]




చేశారు. మరోసారి ఆందోళన చేపడతారా? అనే ప్రశ్నకు స్పందించిన దిప్కే, ప్రభుత్వం తన తీరును మార్చుకోకపోతే తప్పకుండా మరో ఉద్యమం ఉంటుందని చెప్పారు. అది త్వరలోనే ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. జెన్-జెడ్ యువతపై బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ చేసిన వ్యాఖ్యలపై దిప్కే స్పందించారు. ఆమె వ్యాఖ్య లను ఎవరు సీరియస్‌గా తీసుకుంటారని కొట్టిపారేశారు. మరోవైపు జంతర్‌మంతర్ వద్ద ఇటీవల జరిగిన సీజేపీ నిరసనలు, చలో సంసద్ సందర్భంగా రాళ్లతో నిండిన ట్రక్కు కనిపించడంపై దిల్లీ పోలీసులు క్లారిటీ ఇచ్చారు. సోషల్? మీడియాలో వైరల్ అవుతున్న ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. ఆ లారీకి నిరసన కార్యక్రమాలతో ఎలాంటి సంబంధం లేదన్నారు. ఆ ఆరోపణలు పూర్తిగా అవాస్తవం అని, ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని అన్నారు. వాటికి ఎలాంటి ఆధారాలు లేవని స్పష్టం చేశారు. పోలీసులు వెల్లడించిన వివరాలు ప్రకారం, వివాదాస్పదంగా మారిన ట్రక్కును జులై 16న జరిగిన ఓ రోడ్డు ప్రమాదం కేసులో స్వాధీనం చేసుకున్నారు. ఈఈసీఓ వ్యాన్?ను ట్రక్కు ఢీకొనడం వల్ల ఆరుగురు గాయపడినట్లు తెలిపారు. ఈ ఘటనపై పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్?లో ఎఫ్?ఐఆర్? నంబర్ 65/2026 నమోదు చేసి, దర్యాప్తులో భాగంగా ట్రక్కును పోలీసులు తమ అధీనంలోకి తీసుకున్నట్లు వివరించారు. స్వాధీనం చేసుకున్న ట్రక్కును చట్టపరమైన ప్రక్రియలో భాగంగా, భద్రత దృష్ట్యా మొదట సంసద్ మార్గ్ పోలీస్ స్టేషన్ సమీపంలో నిలిపినట్లు పోలీసులు తెలిపారు. పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో తగినంత స్థలం లేకపోవడం వల్ల తాత్కాలికంగా బయట పార్క్ చేసినట్లు [illegible]

## విద్యార్థులపై దాడులకు అమిత్ షానే కారణం-



విద్యార్థులపై జరిగిన పోలీసు దాడికి సంబంధించి లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను బర్తరఫ్ చేయటంతోపాటు సుప్రీంకోర్టు పర్యవేక్షణలో స్వతంత్ర దర్యాప్తునకు ఆదేశించాలని ప్రధాని మోదీని కోరారు. దిల్లీలో మీడియా సమావేశం నిర్వహించిన రాహుల్‌గాంధీ, సభలో మంత్రులకు మాట్లాడే అవకాశం ఇచ్చిన స్పీకర్ ఓం బిర్లా, ప్రతిపక్ష నేతనైన తనకు మాట్లాడే అవకాశం ఇవ్వకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. విద్యార్థులపై కాల్పులు జరిపిన వారంతా నేరుగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా కనుసన్నల్లోనే పనిచేస్తారని రాహుల్ ఆరోపించారు. అయితే, దెబ్బలు తిన్న ప్రతి ఒక్క విద్యార్థికి న్యాయం జరిగేలా కచ్చితంగా చూస్తామని పేర్కొన్నారు. విద్యార్థులపై పెల్లెట్ గన్‌లతో కాల్పులు జరిపిన వారికి కచ్చితంగా శిక్ష పడేలా చేస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులపై జరిగిన దాడులకు సంబంధించి తమ దగ్గర ఫోటోలు, వీడియోలన్నింటినీ సేకరించామన్నారు. మరోవైపు, లోక్‌సభలో తాను చేసిన వ్యాఖ్యలకు క్షమాపణలు చెప్పాలని బీజేపీ డిమాండ్ చేస్తోందన్నారు. అయితే బీజేపీ, ఆర్?ఎస్?ఎస్ లేదా మరెవరికీ తాను ఎప్పటికీ క్షమాపణలు చెప్పబోనని రాహుల్ తేల్చిచెప్పారు. సభలో మంత్రులకు మాట్లాడే అవకాశం ఇచ్చిన స్పీకర్ ఓంబిర్లా, ప్రతిపక్ష నేతనైన తనకు మాట్లాడే అవకాశం ఇవ్వకుండా అడ్డుకున్నారని రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

"జులై 25న కొన్ని ప్రశ్నలు సంధిస్తూ హోంమంత్రి అమిత్‌షాకు నేను లేఖ రాశా. విద్యార్థులపై పెల్లెట్ గన్స్ వాడకపోతే ఎవరు ఆ పని చేశారని అడిగా. విద్యార్థులపై దాడికి అమిత్‌షా బాధ్యులని నేను చెప్పా. దేశానికి ఉపయుక్తమైన అంశాలపై మాట్లాడడం విపక్ష నేతగా నా హక్కు. అయితే, ఈ అంశంపై కేంద్రాన్ని ప్రశ్నిస్తే దిల్లీ వీధుల్లో విద్యార్థులపై దారుణంగా దాడి చేశారు. పెల్లెట్ గన్ తగిలి ఒక యువకుడి కన్ను కోల్పోవాల్సి వచ్చింది. పెల్లెట్ గన్ తగిలి గాయమైనట్లు ఎయిమ్స్ మెడికల్ సర్టిఫికెట్ చూశా. అత్యంత దారుణంగా ముళ్ల లాఠీలతో మహిళలు, మైనర్లపై దాడులు చేశారు."

**'ఫేషియల్ రికగ్నిషన్, బజరంగ్ దళ్ దాడులకు పాల్పడుతున్నారు'**

మరోవైపు, శాంతియుతంగా ధర్నా చేస్తున్న విద్యార్థులపై దాడులు చేయడం తనకు తీవ్ర ఆందోళన కలిగించిందని రాహుల్? పేర్కొన్నారు. హోం మంత్రి, ఆయన భావజాలం కలిగిన వారు తెరవెనుక ఉండి ఈ దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు. "వారు 'ఫేషియల్ రికగ్నిషన్' (ముఖ గుర్తింపు) సాంకేతికతను వాడుతున్నారు, విద్యార్థులను బెదిరిస్తున్నారు. అంతేకాకుండా బజరంగ్ దళ్‌ను వారిపై ఉసిగొల్పి దాడులు చేయిస్తున్నారు. అందుకే నేను ఈ రోజు ఇక్కడ నిలబడి మాట్లాడుతున్నాను. ఈ విషయంపై అందరి దృష్టిని ఆకర్షించాలనుకుంటున్నా. ప్రభుత్వం ఇలాంటి పనులు చేస్తోందన్న విషయం ప్రతి విద్యార్థికీ, వారి తల్లిదండ్రులకూ తెలియాలని నేను కోరుకుంటున్నా. వీరు మన పిల్లలు, మన భవిష్యత్తు. వారిపై దాడి చేయడం, బెదిరించడం, కొట్టడం లేదా కనీసం వారిని తాకడం కూడా ప్రభుత్వానికి తగదు. విద్యార్థులు ఎలాంటి నేరమూ చేయలేదు. ఒకవేళ వారు ఏదైనా నేరం చేసి ఉంటే, వారు నేరం చేశారని, వారికి శిక్ష పడాలని చెప్పే మొదటి వ్యక్తిని నేనే అయ్యేవాడిని. కానీ ఈ యువతీయువకులు ఏ తప్పూ చేయలేదు" అని రాహుల్? గాంధీ పేర్కన్నారు.

**'నా మైక్‌ను మాత్రమే ఆపగలరు'**

అంతకుముందు కూడా, పేపర్ లీక్ నిరోధక చట్ట సవరణ బిల్లుపై లోక్‌సభలో తాను మాట్లాడకుండా బీజేపీ అడ్డుకుందని రాహుల్‌గాంధీ ఆరోపించారు. తన ప్రసంగంలో దిల్లీలో విద్యార్థులపై జరిగిన దమనకాండను ప్రస్తావించినట్లు చెప్పారు. అందుకు హోంమంత్రి అమిత్ షానే బాధ్యుడని పేర్కొన్నట్లు రాహుల్ చెప్పారు. అధికార పక్ష సభ్యులు తన మైక్‌ను మాత్రమే ఆపగలరు కానీ విద్యార్థుల ప్రతిధ్వనిని ఆపలేరంటూ ఎక్స్ పోస్టులో రాహుల్ పేర్కొన్నారు.

## 2028 నాటికి ఈవీ ఎయిర్ అంబులెన్స్, ట్యాక్సీలు

**రన్‌వే లేకుండానే టేకాఫ్, ల్యాండింగ్!**

**నగరాల్లో అత్యవసర రోగులను రక్షించేందుకు ఎలక్ట్రిక్ ఎయిర్ అంబులెన్స్**

**హెలికాప్టర్ల కంటే తక్కువ ఖర్చు- హెలిప్యాడ్‌తో పనిలేకుండా ఇళ్ల పైకప్పుల పైనే ల్యాండింగ్?**

ట్రాఫిక్ జామ్‌లో ఇరుక్కుపోయి ఆస్పత్రికి చేరడం ఆలస్యమై ప్రాణాలు పోయే పరిస్థితులకు త్వరలోనే చెక్ పడబోతోంది. నగరాల్లో అత్యవసర రోగులను రక్షించేందుకు ఎలక్ట్రిక్ ఎయిర్ అంబులెన్స్ సిద్ధమవుతోంది. హెలికాప్టర్ల కంటే తక్కువ ఖర్చుతో, హెలిప్యాడ్‌తో పనిలేకుండా నేరుగా ఇళ్ల పైకప్పుల పైనే ఈ 'గాలి మోటారు' ల్యాండ్ కాగలదు. 2028 నాటికి రానున్న ఈ విద్యుత్ విహంగం కథేంటో ఇప్పుడు చూద్దాం. చెన్నై వంటి మహానగరాల్లో రోజురోజుకూ పెరుగుతున్న వాహనాల రద్దీ వల్ల అత్యవసర సమయాల్లో అంబులెన్స్‌లు కూడా గమ్యస్థానాలకు చేరుకోలేని పరిస్థితి నెలకొంది. ఈ సమస్యకు పరిష్కారంగా గాల్లో ప్రయాణించే విద్యుత్ ఎయిర్ అంబులెన్స్‌ను చెన్నై ఐఐటీ ప్రోత్సాహంతో రూపుదిద్దుకున్న 'ది ఇ ప్లేన్ కంపెనీ' స్టార్టప్ నిపుణులు రూపకల్పన చేశారు. ఐఐటీ ఏరోస్పేస్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ సత్యా చక్రవర్తి నేతృత్వంలో రూపొందుతున్న ఈ విద్యుత్ విమానానికి సంబంధించి, ఇప్పటికే డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ నుంచి అనుమతులు లభించాయి.

**ఎయిర్ అంబులెన్స్‌ల సేవలు**

భారత్‌లోని పలు నగరాల్లో ఇప్పటికే ఎయిర్ అంబులెన్స్‌ల సేవలు ఉన్నాయి. అయితే అవన్నీ హెలికాప్టర్లు లేదా చిన్న సైజు విమానాలు. కానీ ది ఇ-ప్లేన్ కంపెనీ తయారు చేస్తోంది విద్యుత్ విహంగం కావడం గమనార్హం. హెలికాప్టర్‌ను అంబులెన్స్‌గా వాడితే లక్షల్లో ఖర్చు అవుతుంది. ఇది విద్యుత్‌తో నడవడం వల్ల ఛార్జీలు, నిర్వహణ ఖర్చు చాలా తక్కువ. హెలిప్యాడ్, ఎయిర్‌స్ట్రిప్‌తో పనిలేదు. ఉన్న చోటు నుంచే నిలువుగా పైకి లేవడం, కిందకు దిగడం దీని ప్రత్యేకత. ఒక్కసారి ఛార్జ్ చేస్తే 100 కిలోమీటర్ల దూరం వెళ్లే ఈ విహంగంలో 750 కిలోల లిథియం-అయోడిన్ బ్యాటరీ ఉంటుంది. పైలట్‌తో పాటు రోగి, నర్స్ వెళ్లేలా డిజైన్ చేశారు. అలాగే ఒక పైలట్, ఇద్దరు ప్రయాణికులు వెళ్లేలా ఎయిర్ టాక్సీని సిద్ధం చేస్తున్నారు. భవనాల పైకప్పులపై కేవలం 5వేల చదరపు అడుగుల స్థలం ఉంటే ఇవి సులభంగా ల్యాండ్ కాగలవు. ప్రస్తుతం ఐఐటీ తయ్యూర్ క్యాంపస్‌లో ప్రయోగ పరీక్షలు జరుపుకొంటున్న ఈ గాలి మోటరు, అన్ని అనుమతులు పూర్తయి 2028 నాటికి అందుబాటులోకి రానుంది. "ప్రస్తుతం మేం ఎయిర్ టాక్సీ నమూనాను రూపొందిస్తున్నాం. దాని భాగాలను సమీకరిస్తున్నాం. సివిల్ ఏవియేషన్ అథారిటీ నియంత్రణ నిబంధనలను మేరకు ఇందులో ఎగిరే ఎత్తు, శిక్షణ, భద్రతా విధానాలు, ల్యాండింగ్ ప్యాడ్ ఏర్పాటుకు సంబంధించిన అంశాలను పాటిస్తున్నాం. ఈ ఎయిర్ టాక్సీని రిమోట్‌గా ఆపరేట్ చేస్తారు. అయితే, ప్రస్తుతం మేం ఎయిర్ టాక్సీ, ఎయిర్ అంబులెన్స్ రెండింటినీ అభివృద్ధి చేస్తున్నాం. అయితే, తొలుత ఎయిర్ అంబులెన్స్‌ను అభివృద్ధి చేస్తాం. దీనిలో ఒక పైలట్, రోగి, శిక్షణ పొందిన నర్సుతో సహా ముగ్గురిని తీసుకువెళ్లేలా రూపొందిస్తాం. ఇక, ఎయిర్? టాక్సీ విషయానికొస్తే, అందులో ఒక పైలట్, ఇద్దరు ప్రయాణికులు వెళ్లేలా రూపొందిస్తున్నాం. ఒక సంవత్సరంలోగా, ఎయిర్ అంబులెన్స్, ఎయిర్ టాక్సీ డిజైన్‌ను పూర్తి చేసి, దానిని భారత పౌర విమానయాన సంస్థ (సివిల్ ఏవియేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా) ద్వారా పరీక్ష కోసం పంపుతాం. వారు ఆమోదం తెలిపిన తర్వాత, ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తాం"

**రన్‌వే లేకుండానే టేకాఫ్, ల్యాండింగ్**

అయితే, ఈ-ప్లేన్ డిజైన్ కోసం 2023లోనే ధ్రువీకరణ పత్రాలను పొందామని, ఈ-ప్లేన్ టాక్సీ ఆపరేటర్లకు అందించే శిక్షణ, విమానాల పైలట్లకు అందించే శిక్షణ మాదిరిగానే ఉంటుందని ప్రొఫెసర్ పేర్కొన్నారు. అయితే, ఈ టాక్సీల మరో ప్రత్యేకత ఏమిటంటే, రన్‌వే లేని ప్రదేశం నుంచి కూడా నేరుగా టేకాఫ్, ల్యాండింగ్ అయ్యేలా ఈ-ప్లేన్ టాక్సీ రూపొందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# ప్రధానమంత్రి పర్యటనను సమన్వయంతో విజయవంతం చేయాలి.





- ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు చేపట్టాలి.
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి.

**విశాఖపట్నం, పెన్ సత్తా, జూలై 29:** విశాఖపట్నంలో నిర్వహిస్తున్న ప్రతి ప్రభుత్వ కార్యక్రమాన్ని అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో విజయవంతంగా నిర్వహిస్తున్నారని జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి అన్నారు. అదే స్ఫూర్తితో భారత ప్రధానమంత్రి భోగాపురం పర్యటనలో అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా విజయవంతం చేయాలని మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి పిలుపు నిచ్చారు. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా రవాణా, ట్రాఫిక్ నియంత్రణ, తాగునీరు, వైద్య సేవలు, భద్రత తదితర అంశాల్లో పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. ఉత్తరాంధ్ర ప్రజల ఎన్నో ఏళ్ల ఆకాంక్షకు ప్రతిరూపంగా రూపుదిద్దుకున్న అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవం ఈ ప్రాంత అభివృద్ధి చరిత్రలో ఒక చారిత్రాత్మక ఘట్టమని మంత్రి పేర్కొన్నారు. ఆగస్టు 1 న భారత ప్రధానమంత్రి చేతుల మీదుగా జరగనున్న ఈ మహా కార్యక్రమంలో ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన అధికారులకు, ప్రజా ప్రతినిధులకు పలు సూచనలు చేశారు.

కార్యక్రమానికి స్వచ్ఛందంగా హాజరయ్యే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రజల రాకపోకలు, తాగునీరు, ఆహారం, వైద్య సేవలు, భద్రత తదితర అంశాల్లో పకడ్బందీ ఏర్పాట్లు ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి వచ్చే ప్రజల కోసం ప్రత్యేక రవాణా ప్రణాళిక రూపొందించాలని, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి బస్సుల రాకపోకలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. అన్ని బస్సులు ఉదయం 9 గంటలకల్లా భోగాపురం చేరుకునేలా, ఆయా ప్రాంతాల దూరం, రహదారి పరిస్థితులను బట్టి ఉదయం 6 గంటల నుంచే దశలవారీగా బయలుదేరేలా ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. గ్రామం, మండలం, రూట్ వారీగా బాధ్యతలను స్పష్టంగా కేటాయించి అధికారులు, ప్రజా ప్రతినిధులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బస్సుల రూట్ మ్యాప్, సమయాలు, ప్రయాణ వివరాలను ప్రత్యేక యాప్ ద్వారా పర్యవేక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజల సాధారణ రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలగకుండా ప్రత్యేక ట్రాఫిక్ ప్రణాళికను అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటు లోకి రావడం ద్వారా ఉత్తరాంధ్ర ప్రాంతానికి ఉపాధి, పెట్టుబడులు, పర్యాటకం, వ్యాపారం, విమానయాన రంగాల్లో విస్తృత అవకాశాలు లభించనున్నాయని మంత్రి పేర్కొన్నారు. ఈ అవకాశాల పై యువతకు, ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, జాయింట్ కలెక్టర్ జి. విద్యాధరి, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు, శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు, విష్ణుకుమార్ రాజు, కార్పొరేషన్ చైర్మన్లు సీతంరాజు సుధాకర్, గండి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం.

తెదేపా జాతీయ ఉపాధ్యక్షులు వై.వి.బి.రాజేంద్రప్రసాద్.





**ఉయ్యూరు, పెన్ సత్తా, జులై 29:** మున్సిపాలిటీ, 9 వ వార్డులో ఉయ్యూరు టౌన్ పార్టీ అధ్యక్షులు జంపాన గురునాధ రావు, క్లస్టర్ ఇంచార్జ్ వాసుల ఆధ్వర్యంలో జరిగిన డోర్ టు డోర్ కార్యక్రమములో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తో పాటుగా పాల్గొని ఇంటింటికి వెళ్లి కూటమి పాలనలో ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాల గురించి వివరించిన రాజేంద్ర ప్రసాద్. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ కలిసి రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తున్నారని, గత వైసిపి పాలకులు చేసిన తప్పులను ఒక్కొక్కటిగా సరిదిద్దుకుంటూ వస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో పయనింప జేస్తున్నారని రాజేంద్ర ప్రసాద్ అన్నారు.

ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ

కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రానికి పెట్టుబడులు భారీ ఎత్తున వస్తున్నాయని, సంక్షేమ పథకాలు దేశంలో ఎక్కడా లేని విధంగా అమలు చేస్తున్నామని, మన బిడ్డల భవిష్యత్తు లక్ష్యంగా నారా చంద్రబాబు నాయుడు పనిచేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ లు వల్లభనేని సత్యనారాయణ, జంపాన పూర్ణ చంద్రరావు, అబ్దుల్ కుదూస్, తెదేపా నాయకులు జంపన వీర శ్రీనివాస్, సయ్యద్ అజ్మతుల్లా, రాజుల పాటి ఫణి, వార్డ్ అధ్యక్షులు సుంకర అయ్యప్ప, మాజీ కౌన్సిలర్లు వూర కిషోర్, పంద్రాజు చిరంజీవి, తెనాలి పద్మావతి, పరిమి సలోమి సంతోషి, పల్యాల శ్రీను, బూరెల నరేష్, యూనిట్ ఇంచార్జ్ చలపాటి శ్రీను

తదితరులు పాల్గొన్నారు.

# సత్యనారాయణ స్వామిని దర్శించికున్న హోంమంత్రి అనిత.







**విశాఖపట్నం, పెన్ సత్తా, జులై 29:** విశాఖపట్నం లోని ప్రముఖ పుణ్యక్షేత్రం, పూర్ణ మార్కెట్ సమీపం లోని కొండ పై వెలసిన సత్యనారాయణ స్వామి ని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత గురుపౌర్ణమి సందర్భంగా దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న హోంమంత్రి అనితకు దేవస్థాన అర్చకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శనం చేసుకున్నారు. దర్శనం అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం అందించగా, ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలను హోంమంత్రికి అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తులతో ఆప్యాయంగా మాట్లాడిన హోంమంత్రి అనిత వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. గురుపౌర్ణమి సందర్భంగా రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని సత్యనారాయణ స్వామిని ని మంత్రి ప్రార్థించారు.

# రూ.31 లక్షల తో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే యార్లగడ్డ.

- 2 ఏళ్ల నమ్మకం--అభివృద్ధి సంక్షేమం కార్యక్రమం.
- ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరాలు తెలిపిన ఎమ్మెల్యే.
- కట్ల ప్రాంతానికి 50 ఏళ్ల తర్వాత సీసీ రోడ్డు సౌకర్యం కల్పించాం యార్లగడ్డ.
- విజయవాడ రూరల్ 9 గ్రామాలను వీఎంసీలో విలీనం చేయాల్సిందే.
- ప్రసాదంపాడులో రూ.3.73 కోట్లతో సిమెంట్ రోడ్లను నిర్మించాం యార్లగడ్డ.
- ప్రసాదంపాడు--కానూరు కనెక్టింగ్ రోడ్డును రూ.2.52 కోట్లతో అభివృద్ధి చేశాం.
- ఎనికేపాడు అండర్ టన్నెల్ విస్తరణకు రూ.35 కోట్లు మంజూరు.
- ఏలూరు కాలువ రెగ్యులేటర్ అభివృద్ధికి రూ.36 కోట్లు కేటాయింపు.
- గన్నవరం, రామవరప్పాడులో త్వరలో అన్న క్యాంటీన్లు ప్రారంభం యార్లగడ్డ.









**గన్నవరం, పెన్ సత్తా, జులై 29:** విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడు గ్రామంలో బుధవారం నిర్వహించిన 2 ఏళ్ల నమ్మకం -- అభివృద్ధి సంక్షేమం కార్యక్రమంలో ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పాల్గొన్నారు. స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ రాష్ట్ర ప్రభుత్వం గత రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను కరపత్రాల ద్వారా ప్రజలకు వివరించారు. అనంతరం రూ. 31 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 1976 నుంచి కట్ల ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలకు దాదాపు 50 ఏళ్ల తర్వాత సీసీ రోడ్డు సౌకర్యం కల్పించడం ఆనందంగా ఉందన్నారు. కట్ల ప్రాంత అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి సారించామని, పటేల్‌నగర్‌లో రూ. 2.50 కోట్లతో పాటు పలు అభివృద్ధి పనులకు అనుమతులు ఇచ్చామని తెలిపారు. ప్రసాదంపాడులో ఇప్పటివరకు రూ. 3.73 కోట్లతో సిమెంట్ రోడ్లు నిర్మించగా, ప్రసాదంపాడు--కానూరు కనెక్టింగ్ రోడ్డుకు రూ. 2.52 కోట్ల తో అభివృద్ధి చేసినట్లు చెప్పారు. గతంలో రైల్వే శాఖ అనుమతులు లభించక కొన్ని రోడ్డు పనులు నిలిచిపోయినా వాటికి ప్రత్యామ్నాయంగా ఇతర పనులు చేపట్టామని వివరించారు. విజయవాడ రూరల్ మండలం లోని తొమ్మిది గ్రామాలు దశాబ్దాలుగా తాగునీరు, పారిశుద్ధ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నాయని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని గ్రామాల్లో టిడిఎస్ స్థాయిలు అధికంగా ఉండటంతో ప్రజలు అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం విజయవాడ రూరల్ పరిధి లోని తొమ్మిది గ్రామాలను విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేయడమేనని స్పష్టం చేశారు. ఈ అంశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారని, జనాభా లెక్కల ప్రక్రియ అనంతరం ఈ అంశం పై నిర్ణయం తీసుకునే అవకాశముందని తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పోలవరం కుడి కాలువ--ఏలూరు కాలువ అనుసంధానం, ఎనికేపాడు అండర్‌టన్నెల్ విస్తరణ వంటి పనులకు నిధులు సాధించామని ఎమ్మెల్యే చెప్పారు. ఎనికేపాడు అండర్‌టన్నెల్ పనులకు రూ. 35 కోట్లు, ఏలూరు కాలువ రెగ్యులేటర్ అభివృద్ధికి రూ. 36 కోట్లు మంజూరయ్యాయని, ఇవి పూర్తయితే వేలాది ఎకరాలకు సాగునీటి ప్రయోజనం కలుగుతుందని వివరించారు. ఆత్కూరు వద్ద హై లెవెల్ బ్రిడ్జి, భూసేకరణకు నిధులు కేటాయించినట్లు తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు క్లిష్టంగా ఉన్నప్పటికీ గత నెల రోజుల వ్యవధి లోనే గన్నవరం నియోజకవర్గానికి రూ. 100 కోట్లకు పైగా అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రైతుల సాగునీటి అవసరాల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ సహకారంతో పలు కీలక ప్రాజెక్టులు ముందుకు సాగుతున్నాయని చెప్పారు. గన్నవరం పట్టణంలో త్వరలో అన్న క్యాంటీన్ ప్రారంభించనున్నట్లు, రామవరప్పాడులో మరో అన్న క్యాంటీన్‌కు కూడా ప్రభుత్వం ఆమోదం తెలిపిందని ఎమ్మెల్యే వెల్లడించారు. కట్ల ప్రాంత ప్రజలను ద్వితీయ శ్రేణి పౌరులుగా కాకుండా అన్ని మౌలిక సదుపాయాలు కలిగిన ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు రాబోయే మూడేళ్లలో ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తామని హామీ ఇచ్చారు. గన్నవరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అభివృద్ధికి సీఎస్ఆర్ నిధుల ద్వారా రూ. 5 కోట్లు కేటాయించామని, ట్రామా సెంటర్, డయాలసిస్ కేంద్రం ఏర్పాటు కోసం చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ కూటమి కలిసి పనిచేస్తోందని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పేర్కొన్నారు. ప్రజల ప్రయోజనాల కోసం కూటమి మరింత బలంగా ముందుకు సాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అబ్జర్వర్ ఆకుల జయ సత్య , మార్కెట్ యార్డ్ చైర్మన్ గూడవల్లి నరసింహా రావు, విజయవాడ రూరల్ మండలం టిడిపి అధ్యక్షులు గొడ్డల్ల చిన్న రామారావు, రాష్ట్ర టిడిపి కార్యదర్శి మూల్పూరి సాయి కళ్యాణి, సీనియర్ నాయకులు బొప్పన హరికృష్ణ, కోనేరు నాగేంద్ర కుమార్, గ్రామ టిడిపి అధ్యక్షులు పోలిశెట్టి రమణ, టిడిపి నాయకులు పరుచూరి నరేష్, నెక్కంటి శ్రీదేవి, కొల్ల ఆనంద్,దాసరి మహేష్ , నూతి రామకృష్ణ , మొక్కపాటి చైతన్య, ఇజ్జి రామారావు,ఇజ్జి రాము, అల్లిన మహేష్, అడుసుమిల్లి నవీన్ , కానూరు యుగంధర్, అద్దేపల్లి సాంబు , నబిగాని కొండయ్య, గండికోట సీతయ్య, గంపా శ్రీనివాస్, చల్లగాలి సునీల్, సొంగ సంతోష్, కొమ్మినేని బాబీ, దాసరి శ్వేత, గొర్ల రాజేష్, లావణ్య, సాయి, ప్రవీణ, సంధ్య, లోహిత్, చల్లగుల్ల సందీప్, కోసరాజు సాయిరాం, కళ్లేపల్లి భారత్, కొంగన రవి, మున్నంగి సత్యనారాయణ, ఆచంట రాణి, కుదరవల్లి పద్మ, విష్ణు బొట్ల సాయి, ఈలప్రోలు దుర్గాప్రసాద్, గూడవల్లి శివయ్య, గూడవల్లి చంటి వేమూరి మల్లేశ్వరి కూటమిపార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కనకదుర్గను దర్శించుకున్న విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు.

- ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ లతో కలిసి ప్రత్యేక పూజలు.
- శాకంభరీ దేవి అలంకరణలో భక్తులకు దివ్య దర్శనం ఇచ్చిన దుర్గమ్మ.
- రాష్ట్ర ప్రజల సుఖశాంతులు, ఆయురారోగ్యాల కోసం అమ్మవారిని ప్రార్థించిన ప్రజాప్రతినిధులు.
- వేదాశీర్వచనం తీర్థప్రసాదాలు అందించిన వేద పండితులు.





**విజయవాడ, పెన్ సత్తా, జులై 29:** ఇంద్రకీలాద్రి పై జరుగుతున్న శాకంభరీ ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజు బుధవారం కనకదుర్గమ్మ అమ్మవారు శాకంభరీ దేవి అలంకరణలో భక్తులకు దివ్య దర్శనం ఇచ్చారు. పండ్లు, కూరగాయలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన అమ్మవారు భక్తులు దర్శనమిస్తున్నారు. ఈ సందర్భంగా ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ఇంద్రకీలాద్రికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో ఉండాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి రైతాంగం అభివృద్ధి చెందాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. అనంతరం వేద పండితులు వేదాశీర్వచనం అందించగా, ఆలయ అధికారులు తీర్థప్రసాదాలు, అమ్మవారి చిత్రపటాలను ప్రజాప్రతినిధులకు అందజేశారు.

## కన్యకా పరమేశ్వరికి శాకాంబరీ దేవి గా అలంకరణ.



**అనకాపల్లి, పెన్ సత్తా, జులై 29**: పట్టణంలో 1925 లో స్థాపించిన 100 సంవత్సరాల చరిత్ర కలిగిన కన్యకా పరమేశ్వరి దేవస్థానం సంఘం ఆధ్వర్యంలో ఆషాడ మాసం గురు పౌర్ణమి బుధవారం సందర్భంగా ఆలయంలో అమ్మవారు మూల విరాట్ కు వివిధ రకాల కూరగాయలతో శాకాంబరీ దేవి గా అలంకరణ చేశారు. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు ధరించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు వుప్పల రవిరామ్ జవహర్, కార్యదర్శి, శ్రీధరాల సోమరాజు, కోశాధికారి కడిమిశెట్టి అచ్యుత రామయ్య, ఉత్సవ కమిటీ చైర్మన్ గ్రంధి వివిఎస్ మాణిక్యం, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## శాకాంబరి అలంకరణలో నూకాంబిక





**అనకాపల్లి, పెన్ సత్తా, జులై 29:** ఉత్తరాంధ్ర ఇలవేల్పు, గవరపాలెంలో వెలిసిన నూకాంబిక అమ్మవారి దేవస్థానంలో బుధవారం, ఆషాడ మాసం, గురుపౌర్ణమి సందర్భంగా, ప్రముఖ వ్యాపారవేత్త కూరగాయల దాత మళ్ల జగ్గప్పారావు సహకారంతో అమ్మవారికి శాకాంబరి అలంకరణ చేశారు. మాజీ మంత్రి, స్థానిక శాసన సభ్యులు కొణతాల రామకృష్ణ సూచన మేరకు, భోగాపురం లోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం 2026 ఆగస్టు 1 వ తేదీన భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభం కానుండగా, ఆగస్టు 17 వ తేదీ నుంచి వాణిజ్య విమాన సేవలు ప్రారంభం కానున్న సందర్భంగా, ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ, ఉన్నత అధికారుల సూచన మేరకు బుధవారం లక్ష్మీ గణపతి హోమం, వర్షాలు సంతృప్తిగా పడాలని యాగం చేశారు. ఈ కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారి కి మొక్కులు తీర్చుకొని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ పీలా నాగశ్రీను (గొల్ల బాబు), ఆలయ సహాయ కమిషనర్ యాళ్ళశ్రీధర్, ఆలయ ధర్మకర్తలు
సూరే సతీష్, దాడి రవికుమార్,
పొలిమేర స్వాతి ఆనంద్, మారిశెట్టి శంకర్రావు, కాంద్రేగుల రాజారావు, మజ్జి జానకి శ్రీనివాస రావు, కొడుకుల శ్రీకాంత్, వడ్డాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి పైడిరాజు, యర్రవరపు సంతోషి కుమారి నాగేష్, దేవాలయ అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తాగునీరు, సాగునీటి తరలింపు పనుల్లో అంతరాయాల్ని పరిష్కరించాలి.






రెవెన్యూ, సర్వే శాఖల పనుల సమన్వయం పై సమీక్ష.
జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్.

**అనకాపల్లి, పెన్ సత్తా, జూలై 29**: విశాఖపట్నం పరిసర ప్రాంతాలకు నీటి సరఫరా ప్రక్రియను వేగవంతం చేయడం పై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆర్డీవోలు, మండల రెవెన్యూ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే 14 రోజుల్లోగా పనుల్లో ఎదురవుతున్న అన్ని రకాల సమస్యలను, అంతరాయాలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పి.ఎల్.ఎమ్.సి ఇంజనీర్లతో మాట్లాడి, క్షేత్రస్థాయిలో విద్యుత్, రహదారులు, లేదా భూమికి సంబంధించి ఏవైనా అంతరాయాలు ఉంటే తక్షణమే గుర్తించి పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. కొన్ని ప్రాంతాలలో స్థానిక వ్యతిరేకతల వల్ల యంత్రాలు ప్రవేశించలేకపోవడం, మరికొన్ని చోట్ల తవ్విన మట్టిని వేయడానికి సరైన స్థలం లేకపోవడం వంటి సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించాలన్నారు. కొన్ని చోట్ల రహదారుల మళ్లింపు, నిర్మాణాత్మక సమస్యలు, స్థల సేకరణ, నష్టపరిహారం చెల్లింపులు, కోర్టు కేసులకు సంబంధించిన చిక్కులు ఉంటే, వీటిని త్వరితగతిన పరిష్కరించి పనులు వేగంగా జరిగేలా చూడాలన్నారు.

రాబోయే 14 రోజుల్లో పనులన్నీ పూర్తవ్వాలి. మాన్యువల్ సూచనల ప్రకారం, నీరు పాయకరావుపేట కు చేరుకోవాలి. పాయకరావుపేట నుండి విశాఖపట్నం చేరడానికి మరో 2 రోజుల సమయం పడుతుంది. ఈ రెండు రోజుల్లో నీటి ప్రవాహానికి ఎలాంటి అడ్డంకులు ఎదురుకాకూడదన్నారు.

పాయకరావుపేటకు 14 రోజుల గడువు ఉండగా, పరవాడ వంటి చివరి మండలాలకు 16 రోజుల సమయం ఉందని, పనులన్నీ ఎలాంటి విఘాతం లేకుండా వేగవంతంగా జరగాలని అధికారులకు స్పష్టం చేశారు. సర్వే రికార్డులను, రెవెన్యూ నంబర్లను పునఃపరిశీలించినప్పుడు లోపాలు రాకుండా చూసుకోవాలని స్పష్టం చేశారు. సంబంధిత సర్వే అధికారులు తమ శాఖ పరిధి లోని సర్వే పనుల పై పూర్తి బాధ్యత వహించాలని, రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

ఉద్యానవన పంటల నష్ట పరిశీలనను వేగవంతం చేయాలి. వివిధ ప్రాంతాల్లో భూ సేకరణ పరిహార అవార్డులు, ఉద్యానవన (హార్టికల్చర్) ఎన్యూమరేషన్ పనుల పురోగతి పై వివరాలను సమీక్షిస్తూ, ఎస్‌డిసి స్థాయి అధికారుల నుండి పెద తీర్థనాల, సీహెచ్ఎల్ పురం తదితర ప్రాంతాలకు సంబంధించిన ప్రీ-పేమెంట్ అవార్డుల వివరాలను వెంటనే పంపించాలని సూచించారు. ఈ శనివారం లోగా ఉద్యానవన పంటల నష్ట పరిశీలన, ఎన్యూమరేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని ఎమ్ఆర్ఓ లను ఆదేశించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయడానికి అవసర మైనంత మంది సిబ్బందిని క్షేత్రస్థాయిలో నియమించి పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. పనులన్నింటినీ నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు.

బల్క్ డ్రగ్ పార్క్ రహదారులు, భూముల అంచనాల పై సమీక్ష.

బల్క్ డ్రగ్ పార్క్ ప్రాజెక్ట్‌కు సంబంధించి పలు అభివృద్ధి పనులు, భూముల సర్వే పురోగతి పై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభావిత భూములలో ఉన్న నిర్మాణాలు, చెట్ల విలువ అంచనా నివేదికలను శనివారం లోగా సిద్ధం చేయాలని ఆదేశించారు. బల్క్ డ్రగ్ పార్క్ అప్రోచ్ రోడ్డుకు సంబంధించి పెగ్ మార్కింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ భూములను స్పష్టంగా గుర్తించి, రహదారి నిర్మాణ పనులు స్పష్టంగా కనిపించేలా చూసుకోవాలని సూచించారు. పనుల్లో ఎలాంటి జాప్యం సహించేది లేదని, నిర్దేశిత సమయానికి పనులు పూర్తి కావాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ శౌర్య మాన్ పటేల్, జిల్లా రెవెన్యూ అధికారి వై. సత్యనారాయణ రావు, నర్సీపట్నం అనకాపల్లి ఆర్డీవోలు వివి రమణ, ఆయేషా, తాహశీల్దార్లు, సర్వేయర్లు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలు, మీసేవ దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలి.

ప్రజా సేవల్లో జాప్యాన్ని సహించేది లేదు జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్.

**అనకాపల్లి, పెన్ సత్తా, జూలై 29**: ప్రజా సమస్యల పరిష్కారం, మౌలిక వసతుల కల్పన, సంక్షేమ పథకాల అమలు, మీసేవ సేవలందించడంలో ఎలాంటి జాప్యం జరిగినా సహించేది లేదని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ స్పష్టం చేశారు.

బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్షా సమావేశంలో వివిధ శాఖల పనితీరు, మౌలిక సదుపాయాలు, రేషన్ పంపిణీ, పింఛన్లు, మీసేవ దరఖాస్తులు, ఈ-కేవైసీ, రీ-సర్వే, మ్యుటేషన్ల పురోగతి పై శాఖల వారీగా సమగ్ర సమీక్ష నిర్వహించారు.

మౌలిక వసతుల అభివృద్ధి వేగవంతం చేయాలి. జిల్లాలో తాగునీరు, విద్యుత్, రహదారులు, పాఠశాలలు, కమ్యూనిటీ హాళ్ల అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నిలిచిపోయిన రహదారి పనులు, కనెక్టివిటీ సమస్యలను ప్రణాళికాబద్ధంగా వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. రేషన్, పింఛన్ల పంపిణీలో జాప్యం ఉండరాదు. కాలనీలు, మారుమూల గ్రామాల్లో రేషన్, పింఛన్లు సకాలంలో అందేలా పంపిణీ ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలని ఆదేశించారు. పింఛన్ల మ్యాపింగ్‌లో ఉన్న సాంకేతిక సమస్యలను డీఆర్‌డీఏ, గ్రామ, వార్డు సచివాలయాల (జిఎస్డబ్ల్యూఎస్) అధికారులతో సమన్వయం చేసుకుని వెంటనే పరిష్కరించాలని సూచించారు.

మీసేవ పెండింగ్ దరఖాస్తుల పై అసంతృప్తి. మీసేవ పోర్టల్‌లో ఆదాయ, కుల, ఓబీసీ, భూమి విలువ, కుటుంబ సభ్యుల ధృవీకరణ, జనన-మరణాల ఆలస్య నమోదు దరఖాస్తులు అధికంగా పెండింగ్ లో ఉండటం పై కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నిబంధనల ప్రకారం పరిశీలించి అన్ని దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని ఆదేశిస్తూ, తదుపరి సమీక్షా సమావేశం నాటికి మీసేవ పెండింగ్ దరఖాస్తులు సున్నాకు చేరాలి. ప్రజా సేవల అమలులో నిర్లక్ష్యం ప్రదర్శించిన అధికారుల పై కఠిన చర్యలు తీసుకుంటాం అని హెచ్చరించారు.

ఎస్. రాయవరం మండలంలో రీ-రిజెక్షన్లు లేకపోయినా, గడువు దాటిన 55 శాతం దరఖాస్తులు పెండింగ్‌లో ఉండటాన్ని తప్పుబట్టారు. అనకాపల్లి మండలం దరఖాస్తుల పరిష్కారంలో మెరుగైన పనితీరు కనబరుస్తోందని అభినందించారు. జిల్లాలో సగటున 11 శాతం దరఖాస్తులు తిరస్కరణకు గురవగా, కొన్ని ప్రాంతాల్లో 40 శాతం వరకు తిరస్కరణలు నమోదవడం పై సంబంధిత అధికారులు స్పష్టమైన కారణాలు తెలియజేయాలని ఆదేశించారు. ఈ-కేవైసీ, రీ-సర్వే పనులు వేగవంతం చేయాలి. ఆర్ఓఆర్ పూర్తయిన గ్రామాల్లో ఈ-కేవైసీ, రీ-సర్వే పనుల పురోగతిని సమీక్షించారు. మాకవరపాలెం మండలంలో 81 శాతం, అచ్యుతాపురం మండలంలో 86 శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. సెప్టెంబర్ నాటికి లక్ష్యాలను పూర్తిచేయాలని సూచించారు. మ్యుటేషన్లు, పెండింగ్ దరఖాస్తులను వెంటనే పూర్తి చేయాలి.

నన్నుపర్తి గ్రామంలో మొత్తం 823 ఖాతాలు ఉండగా, డ్రాఫ్ట్ ఆర్ఓఆర్ పూర్తయి 107 రోజులు గడిచినా వచ్చిన 40 దరఖాస్తుల్లో 20 మాత్రమే పరిష్కరించడం పై అసంతృప్తి వ్యక్తం చేశారు. మిగిలిన దరఖాస్తులను వెంటనే పరిశీలించి పూర్తి చేయాలని, తహసీల్దార్ లాగిన్‌లలో పెండింగ్‌లో ఉన్న అన్ని దరఖాస్తులను వేగంగా క్లియర్ చేయాలని ఆదేశించారు. వృద్ధుల సంక్షేమం పై ప్రత్యేక దృష్టి. ఆస్తులు స్వాధీనం చేసుకున్న తర్వాత తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే పిల్లల పట్ల అధికారులు ఎలాంటి సానుభూతి చూపాల్సిన అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇటువంటి కేసులను ఆర్‌డీఓల దృష్టికి తీసుకెళ్లి సీనియర్ సిటిజన్స్ చట్టం ప్రకారం విచారణ జరిపి, అవసర మైతే తల్లిదండ్రులకు నెలవారీ జీవన భృతి కల్పించడం లేదా వారు ఇచ్చిన ఆస్తుల రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసి తిరిగి వారి పేర్ల పై నమోదు చేసే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తల్లిదండ్రులు, పిల్లల మధ్య వివాదాల్లో న్యాయం జరిగేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.








ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శౌర్య మాన్ పటేల్, డి.ఆర్వో వై. సత్యనారాయణ రావు, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లు కె. మనోరమ, అనిత, సుబ్బలక్ష్మి, జిల్లా పౌర సరఫరాల అధికారి మూర్తి, అనకాపల్లి ఆర్‌డీఓ షేక్ అయిషా, నర్సీపట్నం ఆర్‌డీఓ వి.వి. రమణ, ఏడీ సర్వే గోపాలరాజా, జిల్లాలోని అన్ని మండలాల రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# శాఖంబరి గా భక్తులకు దర్శనమిచ్చిన కనక దుర్గ.

**అనకాపల్లి, పెన్ పెన్, జులై 29:** సతకంపట్టు, గవరపాలెం, కొలువైన కనకదుర్గ అమ్మవారి ఆలయంలో ఆషాడ మాసం గురు పౌర్ణమి బుధవారం సందర్భంగా ఆలయ శాశ్వత చైర్మన్, నిర్వాకులు కాంద్రేగుల నాయుడు
భాగ్యలక్ష్మి దంపతులు సౌజన్యంతో కనక దుర్గ అమ్మవారికి శాఖంబరీ అలంకరణ చేశారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు పి వి రమణ, ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ భీమరశెట్ట వరాహ నూకరాజు, ఆలయ ప్రధాన అర్చకులు కె హరి నారాయణ, అలంకరణ కర్త ఉదయగిరి చంద్రశేఖర్, గౌరీపరమేశ్వరుల కమిటీ, మరిడిమాంబ అమ్మవారి ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలం.



- త్వరలోనే అటాక్స్ కమిటీలు నియామకం.
- రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థ సారధికి.
- 11 డిమాండ్ల పై వినతిపత్రం సమర్పించిన ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్.

**విశాఖపట్నం, పెన్ సత్తా, జూలై 29:**రాష్ట్రంలో జర్నలిస్టుల పెండింగ్ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించేందుకు వీలైనంత త్వరలో తగు చర్యలు తీసుకుంటారన్నారు. ఇప్పటికే జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు పై ప్రభుత్వం అధ్యయనం చేస్తుందని పేర్కొన్నారు. ఇక త్వరలో అటాక్స్ కమిటీలు నియమించడం జరుగుతుందన్నారు. తాజాగా ఈ ఫైల్ ను సిద్ధం చేస్తున్నామన్నారు. ఇటీవల అమరావతిలో జర్నలిస్టులకు సంబంధించిన ఇళ్ల స్థలాల ఫైల్ పరిశీలన నిమిత్తం సంబంధిత అధికారులకు పంపించా మన్నారు. బుధవారం డాబా గార్డెన్స్ లో వి జె ఎఫ్ (వైజాగ్ జర్నలిస్టులు ఫోరం) ప్రెస్ క్లబ్ లో
మంత్రి కొలుసు పార్థ సారథి ని
ఏపీ వర్కింగ్ జర్నలిస్టులు ఫెడరేషన్, బ్రాడ్ కాస్ట్ స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలుసుకుని 11 పెండింగ్ డిమాండ్లకు సంబంధించి
వినతి పత్రం అందజేశారు. వీటి పై మంత్రి సానుకూలంగా స్పందించారు. త్వరలోనే ఆయా సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామన్నారు. ప్రభుత్వం జర్నలిస్టులకు అండగా ఉంటుందన్నారు.
జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి, ఆంధ్ర ప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టులు ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, విశాఖ జిల్లా అధ్యక్షులు పి నారాయణ లు మంత్రిని కలిసిన అనంతరం మాట్లాడుతూ
జర్నలిస్టులకు సంబంధించిన 11 డిమాండ్ల పై మంత్రికి వినతి పత్రం సమర్పించామని, ఈ నెల 31న రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టుల డిమాండ్స్ డే ని పాటిస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆయా జిల్లాల కలెక్టర్లు ఇతర ముఖ్య అధికారులు ప్రజా ప్రతినిధులకు తమ సభ్యులు వినతి పత్రాలు అందజేసి డిమాండ్స్ డే ను జయప్రదం చేయనున్నట్లు చెప్పారు. వీలైనంత త్వరలో జర్నలిస్టులు సమస్యలు పరిష్కారం కావాలన్నదే ఫెడరేషన్ ముఖ్య లక్ష్యంగా చెప్పారు. అనంతరం మంత్రి పార్థసారథిని జర్నలిస్టులు ఘనంగా సత్కరించగా గంట్ల శ్రీనుబాబు సింహాద్రి నాథుడి జ్ఞాపికను బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి జి శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ డి. రవికుమార్, కార్యవర్గ సభ్యుడు బొబ్బర ప్రసాద్, బ్రాడ్ కాస్ట్ అధ్యక్ష కార్యదర్శులు ఇరోతి ఈశ్వర్ రావు, కింతాడ మదన్, స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జగన్మోహన్, హరి, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

# పూర్వం నుంచి ఉన్న రిజిస్ట్రేషన్ శాఖను ప్రైవేటుపరం చేయడం అన్యాయం



**నక్కపల్లి, పెన్ సత్తా, జులై 29:** పూర్వీకుల కాలం నుండి ఉన్న రిజిస్ట్రేషన్ శాఖను ప్రైవేటీకరణ చేయడం న్యాయం కాదని సిపిఎం జిల్లా కార్యవర్గ దర్శి సభ్యులు ఎం అప్పలరాజు అన్నారు.1908లో చట్టం చేయబడి అప్పటినుంచి పురాతనంగా కొనసాగుతున్న రిజిస్ట్రేషన్ శాఖను ప్రైవేటు వ్యక్తులకు దార దత్తం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అప్పలరాజు పేర్కొన్నారు. నక్కపల్లి సబ్ రిజిస్టర్ ఆఫీస్ పరిధిలోని దస్తావేజు లేఖరుల పెన్ డౌన్ సమ్మెకు బుధవారం సంఘీభావం తెలిపిన ఆయన మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ శాఖ ప్రభుత్వ పరిధిలో చాలా ముఖ్యమైనదని ఇటువంటి శాఖను ప్రైవేటుపరం చేయాలన్న ప్రభుత్వ సంకల్పాన్ని వ్యతిరేకిస్తున్నామని తక్షణం జీవో నెంబర్ 396 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నక్కపల్లి దస్తావేజు లేకర్ల పెన్ డౌన్ సమ్మె పదో రోజుకు చేరుకుంది . జీవో నెంబర్ 396 రద్దు చేయాలని తమ వృత్తికి భద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దస్తావేజులేఖరుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు దాతారం మురళీకృష్ణ , కార్యదర్శి బత్తుల శ్రీను, సహాయ కార్యదర్శి డి.ఎం.పి కుమార్, ట్రెజరర్ లోవరత్నం, రాంబాబు, సాయి తేజ, కూరపాటి సూర్యనారాయణ, నూకరాజు, గోవిందు, వరహాలు, బొంతు రాజు, లక్ష్మి, ధారబాబు, కుమారు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ వినియోగదారుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి.

- క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం వీడాలని డిమాండ్.
- ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎస్. రామకృష్ణకు వినతిపత్రం.



**అనకాపల్లి, పెన్ సత్తా, జులై 29**: విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, అధిక బిల్లులు, ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న వినియోగదారుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రముఖ సామాజిక కార్యకర్త, జగన్నాథ స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ దాడి ఈశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) ఎస్. రామకృష్ణకు యంగ్ స్టూడెంట్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగదారుల వివిధ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లాను. అనంతరం ఆ వివరాలను మీడియాకు వివరించారు. విద్యుత్ శాఖ దిగువ స్థాయి అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది తమ నిర్లక్ష్యాన్ని వీడి, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సేవలు అందించాలని కోరారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా తరచుగా విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. వోల్టేజీ హెచ్చుతగ్గుల వల్ల విలువైన గృహోపకరణాలు పాడైపోయి ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారు. మీటర్లలో సాంకేతిక లోపాలు తలెత్తుతున్నాయి. వాడిన విద్యుత్ వినియోగానికి మించి అసాధారణంగా అధిక బిల్లులు రావడం వినియోగదారులను ఆందోళనకు గురిచేస్తోందన్నారు. కొత్త కనెక్షన్లు ఇవ్వడం లోనూ, అదనపు లోడ్ మంజూరు చేయడం లోనూ తీవ్ర జాప్యం జరుగుతోంది. కొన్ని సందర్భాల్లో అకారణంగా దరఖాస్తులను తిరస్కరిస్తున్నారని ఆయన ఆరోపించారు. డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లపై ఓవర్‌లోడ్ పడటం వల్ల అవి తరచుగా కాలిపోతున్నాయని, వాటిని మరమ్మతు చేయడంలో లేదా వేరే చోటకు తరలించే క్రమంలో సిబ్బంది వినియోగదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఈశ్వరరావు విమర్శించారు. గృహ అవసరాల నుండి వాణిజ్య అవసరాలకు లేదా వాణిజ్య నుంచి గృహ అవసరాలకు కేటగిరీ మార్చే సేవల్లోనూ తీవ్ర జాప్యం చోటు చేసుకుంటోంది. ప్రజలు ఎదుర్కొంటున్న ఈ సమస్యల తీవ్రతను ఉన్నతాధికారులు అర్థం చేసుకుని, తక్షణ పరిష్కారానికి క్షేత్రస్థాయి సిబ్బందికి తగిన ఆదేశాలు జారీ చేయాలని, తద్వారా వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని ఈఈ రామకృష్ణను దాడి ఈశ్వర రావు కోరారు. ఈ సందర్భంగా ఇఇ ఎస్.రామకృష్ణను యంగ్ స్టూడెంట్స్ క్లబ్ ప్రతినిధులు దుశ్శాలువతో సత్కరించారు.

# అధినేత పర్యటనను విజయవంతం చేద్దాం.

వైయస్సార్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త సాడి.శ్యాం ప్రసాద్ రెడ్డి



**ఇచ్ఛాపురం పెన్ సత్తా, జులై 29:**:వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఈనెల 30వ తేదీన శ్రీకాకుళం జిల్లా పర్యటన నిమిత్తం, ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త సాడి.శ్యాం ప్రసాద్ రెడ్డి నియోజకవర్గ ముఖ్య నాయకులుతో సమావేశం నిర్వహించారు. షెడ్యూల్ ప్రకారం జగన్మోహన్ రెడ్డి శ్రీకాకుళం జిల్లా జైలు అంపోలు వద్దకు మధ్యాహ్నం 2గంటలకు చేరుకుంటున్న నేపథ్యంలో ఇచ్ఛాపురం నియోజకవర్గం నుండి భారీగా జనసమీకరణ చేసి అధినేత పర్యటన విజయవంతం చేద్దామని పేర్కొన్నారు.ప్రతి మండలంలోని ముఖ్య నాయకులు ఈ బాధ్యతను తీసుకోవాలని చెప్పారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు.రామారావు,రాష్ట్ర వైఎస్సార్ బీసీ విభాగం కార్యదర్శి నర్తు.నరేంద్ర, కంచిలి,ఇచ్ఛాపురం ఎంపీపీలు పైల.దేవదాసు రెడ్డి,బోర.పుష్ప, కంచిలి సోంపేట జడ్పిటిసి ప్రతినిధులు ఇప్పిలి. కృష్ణారావు,తడక జోగారావు, మరియు ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# "ఉత్తరాంధ్రకు రెక్కలొచ్చాయి".

- మండల స్థాయి పోటీలలో విజేతలు వీరే



**కవిటి( పెన్ సత్తా, జులై 29:**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న "ఉత్తరాంధ్రకు రెక్కలొచ్చాయి" కార్యక్రమంలో భాగంగా 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు విద్యార్థులకు మండల స్థాయిలో క్విజ్, వ్యాసరచన మరియు డ్రాయింగ్ పోటీలు బుధవారం కవిటి స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించబడ్డాయని మండల విద్యాశాఖ అధికారి ధనుంజయ.మజ్జి పేర్కొన్నారు.ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం ఉత్తరాంధ్ర ప్రాంత అభివృద్ధి,గిరిజన వారసత్వం,స్థానిక ఉత్పత్తులు,సహజ వనరులు,పర్యాటక ప్రదేశాలు,పారిశ్రామిక ప్రగతి,భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం వంటి అభివృద్ధి కార్యక్రమాలు మరియు "స్థానిక ఉత్పత్తులు -- ప్రపంచ మార్కెట్లు" అనే భావనపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడం అని చెప్పారు.ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి-2 సనపల.రామకృష్ణ మాట్లాడుతూ"ఉత్తరాంధ్రకు రెక్కలొచ్చాయి" అనే భావన కేవలం అభివృద్ధి కార్యక్రమాలకు మాత్రమే పరిమితం కాకుండా, విద్యార్థుల్లో తమ ప్రాంత చరిత్ర, సంస్కృతి,గిరిజన వారసత్వం,స్థానిక వనరులు మరియు అభివృద్ధి అవకాశాల పట్ల గర్వభావాన్ని పెంపొందించే ఒక ప్రజ్ఞా ఉద్యమమని తెలిపారు.మండల స్థాయి క్విజ్ పోటీలో బొరివంక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి డి. చందు, వ్యాసరచనలో ముత్యాల పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని బాగా.దీక్షిత, డ్రాయింగ్ పోటీలలో బొరివంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి పి.మనోహర్ విజేతలుగా నిలిచి గురువారం జిల్లాస్థాయిలో జరగబోవు పోటీలకు హాజరవుతారని సనపల.రామకృష్ణ తెలిపారు.ఈ కార్యక్రమంలో
కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నేల. విశ్వనాథం,మండలంలోని అన్ని వివిధ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు,కార్యాలయ సిబ్బంది సిఆర్ఎంటి తనుజ పాల్గొన్నారు.

# ప్రతి విద్యార్థీ ప్రకృతితో మమేకమై జీవించాలి.



- ప్రకృతి వనరుల పరి రక్షణ మానవాళి బాధ్యత.
- విద్యార్థులు దేశీయ విత్తనాలు సేకరించి సామాజిక వనాలు పెంచాలి.
- జంక్ ఫుడ్ వద్దే వద్దు.
- జెవి రత్నం, వ్యవస్థాపక కార్యదర్శి, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ.

**పెందుర్తి, పెన్ సత్తా, జులై 29:**ప్రకృతితో మమేక మై జీవించాలి అని గ్రీన్ క్లైమేట్ టీమ్ ఎన్జీవో వ్యవస్థాపక కార్యదర్శి జే వి రత్నం పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం పెందుర్తి మండలం పెద్దగాడి చెరువులో ఉన్న సంకల్ప కళా గ్రామంలో మారికవలసకు చెందిన ఇంటెల్లి విద్యా సంస్థ విద్యార్థులను తీసుకువెళ్లి అక్కడ సంకల్ప వ్యవస్థాపకులు ఆకులు చలపతిరావు ఏర్పాటు చేసిన కట్టే కానుక పని చేస్తున్న విధానం విద్యార్థులకు అవగాహన కల్పించారు. మట్టితో తయారు చేస్తున్న వినాయక ప్రతిమలను చూపించి పూజకు వీటిన వినియోగించాలని, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తో తయారుచేసిన రంగురంగుల వినాయకుల బొమ్మల వల్ల కలిగే నష్టాలను వివరించారు. అక్కడ ఉన్న ఆయుర్వేద మొక్కలను చూపించి వాటి గురించి నా వివరాలు తెలియజేశారు. విభిన్న రకాల పండ్ల మొక్కలు, కూరగాయ మొక్కలు, పక్షులు గూళ్ళు పెట్టుకునే చెట్లను చూపించి వాటి గురించి వివరించారు. అలాగే సంకల్ప కళా గ్రామం ప్రతినిధి జమీలియా ప్రకృతి ఆధారంగా రంగులు వేసి చేస్తున్న కొయ్య బొమ్మల గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం రత్నం మాట్లాడుతూ ప్రకృతి ఆధారిత పంటలు ఆహారంగా తీసుకోవడం వల్ల కలిగే లాభాలను వివరించారు. ప్రకృతి వనరుల పరిరక్షణ మానవాళి బాధ్యత అని వివరించారు. ప్రతి విద్యార్థి దేశీయ విత్తనాలు సేకరించి సామాజిక వనాలు పెంచాలని కోరారు. జంక్ ఫుడ్ వద్దే వద్దని దాని వల్ల కలిగే నష్టాలు వివరించారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా జీవించడానికి ప్రకృతి ఆధారంగా ఉన్న ఆయుర్వేద వైద్యాన్ని పెంచుకోవాలని కోరారు. ప్రతి విద్యార్థి తమ ఇంటి మేడ మీద, బాల్కనీలో, ఇంటి చుట్టుతో ఉన్న ప్రాంతంలో విరివిగా మొక్కలు నాటి పెంచాలని కోరారు. కూరగాయలు వేద్దాలతో ఎరువులు తయారు చేసి మొక్కలు పెంచడం ద్వారా ఆ ఇంటి దగ్గర ఉష్ణోగ్రతలు తగ్గించవచ్చని వివరించారు. ఇంటి దగ్గర మొక్కలు పెంచడం ద్వారా మానసిక స్థితి ప్రశాంతంగా ఉంటుందని వివరించారు.
ఈ కార్యక్రమంలో ఇంటెల్లి ఉపాధ్యాయులు సృజన, శిరీష, శ్రీదేవి, భవానీ, హరిప్రియ, ప్రమీల, స్టెఫీ, విద్యార్థులు పాల్గొని మాట్లాడారు.

# నేడు చినదొడ్డిగల్లు సత్తమ్మ తల్లి పండగ



వేలాదిగా తరలి రానున్న భక్తులు

అమ్మవారి ఆలయం వద్ద భారీ ఏర్పాట్లు

**నక్కపల్లి, పెన్ సత్తా, జులై 29:** మండలంలో చిన దొడ్డిగల్లు లో గ్రామదేవత సత్తమ్మ తల్లి అమ్మవారి పండగ కు భారీ ఏర్పాట్లు చేశారు. ప్రతీ ఏటా ఆషాడ మాసం రెండవ గురువారం సత్తమ్మ తల్లి జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. గ్రామస్తులతో పాటు సమీప గ్రామాల ప్రజలు అమ్మవారి పండగను అంగరంగ వైభవంగా జరుపుకుంటారు. నక్కపల్లి మండలం తో పాటు ఎస్ రాయవరం, పాయకరావుపేట, తుని మండలాల నుండి వేలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా భారీకేడ్లు ఏర్పాటు చేశారు. అమ్మవారి ఆలయాన్ని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయం వద్ద పెద్ద ఎత్తున జాతర జరుగుతుంది. దీనిలో భాగంగా సాయంత్రం గ్రామంలో అమ్మవారి ఊరేగింపు నిర్వహిస్తారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా నక్కపల్లి సిఐ జే మురళి ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.



# పీఓకేలో ఏం జరుగుతోంది

దాదాపు రెండు నెలలుగా కొనసాగుతోన్న ప్రజా ఆందోళనలతో పాక్ ఆక్రమిత కశ్మీర్ అట్టుడుకుతోంది. ఎన్నికలను బహిష్కరిస్తూ చేపట్టిన ఉద్యమం ఉద్రిక్తంగా మారింది. జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ చేపట్టిన లాంగ్ మార్చ్‌కు ముందు భద్రతా బలగాలు, ఆందోళనకారుల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఈ ఘర్షణల్లో కనీసం 20 మంది నిరసనకారులు మృతి చెందారు. పదుల సంఖ్యలో గాయపడ్డారు. ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పాక్ బలగాలు టియర్ గ్యాస్ ప్రయోగించి, గాల్లోకి కాల్పులు జరిపాయి. అయినప్పటికీ జనం వెనక్కి తగ్గలేదు.పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉద్యమాన్ని ఉక్కుపాదం అణచివేయడానికి దాయాది చేయని ప్రయత్నం లేదు. పీఓకేలో ఎన్నికలను బహిష్కరించాలని పిలుపునిచ్చిన స్థానికులపై క్రూరత్వానికి పాల్పడుతోంది. ముజఫర్‌పూర్ లాంగ్ మార్చ్‌కు ముందు నిరసనకారులపై పాకిస్థాన్ సైన్యం జరిపిన కాల్పుల్లో గత 24 గంటల్లో కనీసం 20 మంది కశ్మీరీలు మరణించగా, 50 మందికి పైగా గాయపడ్డారు. రావల్కోట్‌లోని డ్రైక్ వద్ద నిరసనకారులను పాక్ బలగాలు లక్ష్యంగా చేసుకోవడంతో హింస చెలరేగినట్లు సమాచారం. ఎన్నికలను బహిష్కరణకు పిలుపునిచ్చిన జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (జేఏఏసీ) కోర్ కమిటీ సభ్యుడు, అధికార ప్రతినిధి ఉమర్ నజీర్ కశ్మీరీ సోదరుడు ఉస్మాన్ నజీర్‌తో సహా 20 మందిని భద్రతా దళాలు హతమార్చినట్లు వర్గాలు తెలిపాయి. దీంతో జూన్ 5 నుంచి పాకిస్థాన్ సైన్యం కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయినవారి సంఖ్య 80కి చేరుకుంది.గుమిగూడి ఉన్న నిరసనకారులపై భద్రతా దళాలు కాల్పులు జరపడంతో మృతదేహాలు రోడ్లపై చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. పీఓకే ఇన్‌ఫ్లూయెన్సర్ అఖీల్ భాయ్ సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ.. మాకు అండగా నిలబడాలని వేడుకున్నాడు. "మిత్రులారా మా పరిస్థితులు చాలా దయనీయంగా మారాయి... రావల్కోట్ మృతదేహాలతో, గాయపడినవారితో నిండిపోయింది.. దేవుడి కోసం, ఈ క్షణంలో మాకు అండగా నిలబడండి.. దయచేసి, మాకు తోడుగా ఉండండి" వేడుకున్నాడు.తృటిలో నేను ప్రాణాలతో బయటపడ్డాను. నా ప్రాణాల గురించి ఇక చింతలేదు.. ఎంతో మంది సోదరులు అమరులైన తర్వాత నేను మీ ముందుకు వచ్చి చేతులు జోడించి వేడుకుంటున్నాను.. దయచేసి కొంచమైన విచక్షణతో ఆలోచించండి.. ఈ వీడియోను చూస్తున్న అంతర్జాతీయ మీడియాను విజ్ఞప్తి చేసేది ఒకటే.. దయచేసి మాకు మద్దతు ఇవ్వండి. మేము ప్రశాంతమైన ప్రజలం.. లెక్కలేనన్ని మృతదేహాలు, లెక్కలేనంత మంది గాయపడ్డారు. మృతదేహాలను మా భుజాలపై మోసి మోసి అలసిపోయాం" అని ఆవేదన వ్యక్తం చేశాడు.పీఓకేలో ఎన్నికల బహిష్కరణకు పిలుపునిచ్చి, ఉద్యమాన్ని నడిపిస్తున్న జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ నాయకులను పాకిస్థాన్ సైన్యం లక్ష్యంగా చేసుకుంది. సోమవారం నుంచి ఎన్నికల ప్రక్రియ మొదలుకాగా.. భద్రత కోసం 14 వేల మందికిపైగా సైనికులను పీఓకేలో ఇస్లామాబాద్ మోహరించింది. అంతేకాదు, పలు ప్రాంతాల్లో స్నైపర్లను మోహరించగా.. ఆందోళనకారులను చెదరగొట్టడానికి భద్రతా దళాలు నిజమైన తూటాలు, లాంగ్ రేంజ్ టియర్ గ్యాస్ షెల్స్ ఉపయోగిస్తున్నాయని ఆరోపణలు వచ్చాయి.ఐఏఎన్ఎస్ నివేదిక ప్రకారం.. గత కొన్నివారాల నుంచి నిరసనలు జరుగుతున్న ఈ ప్రాంతంలో అసమ్మతిని ఉక్కుపాదం అణచివేయడానికి ఆందోళనకారులపై కాల్పులు జరపాలని భద్రతా దళాలను ఆదేశించారు. పీఓకే ప్రజలపై బలప్రయోగంతో పాటు ఇంటర్నెట్, మొబైల్ సేవలను కూడా ప్రభుత్వం నిలిపివేసింది. ఆ ప్రాంతంలోని అనేక చోట్ల విద్యుత్, నీటి సరఫరాను కూడా నిలిపివేశారు.పీఓకే స్థానిక అసెంబ్లీలోని 53 స్థానాలకు గానూ 45 సీట్లకు ఆగస్టు 10 వరకు మూడు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. మిగిలిన 8 స్థానాలకు మహిళలు, టెక్నోక్రాట్స్, మతపెద్దలను నామినేట్ చేస్తారు.పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికల నిర్వహణపై భారత్ స్పందించింది. పీఓకేలో జరుగుతోన్న మానవహక్కుల ఉల్లంఘనలను బయట ప్రపంచానికి తెలియకుండా కప్పిపుచ్చుకునే ప్రయత్నాల్లో భాగమే ఈ ఎన్నికల నాటకని భారత్ మండిపడింది. ఆక్రమిత ప్రాంతం ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగమేనని స్పష్టం చేసింది. ఈ మేరకు విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ తీవ్ర స్థాయిలో దాయాదిపై విమర్శలు గుప్పించారు.పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో స్థానిక అసెంబ్లీకి ఎన్నికలు జరుగుతున్నాయనే వార్తలను మనం చూశాం.. జమ్మూ కశ్మీర్, లడక్ సహా బలవంతంగా పాక్ ఆక్రమించుకున్న భూభాగం ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగమే. అక్కడ జరుగుతున్న ఎన్నికల తతంగం ఇస్లామాబాద్ ఆక్రమణలను కప్పిపుచ్చుకోవడం, తీవ్ర మానవహక్కుల ఉల్లంఘనల వంటి అకృత్యాలను బయటి ప్రపంచానికి తెలియకుండా చేసే ప్రయత్నమే. ఆర్థిక వనరుల దోపిడీ, ప్రాథమిక హక్కులు హరించడం, అణచివేత వంటి వాటి ఫలితమే ఇటీవల అక్కడ జరుగుతున్న ఉద్యమం" అని రణ్‌ధీర్ జైస్వాల్ పేర్కొన్నారు మైనారిటీలు, వారి సాంస్కృతిక హక్కుల పరిరక్షణలో ఆ దేశానిది అత్యంత చెత్తన రికార్డు.. అలాంటి వారు చేస్తోన్న వ్యర్థ ప్రయత్నాలను మరింత నకిలీవిగా కనబడేలా చేస్తాయి"అని ఆయన అన్నారు. గతేడాది పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేయాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. జులై 27వ తేదీన మిర్పూర్ డివిజన్‌లోని 13 సీట్లకు పోలింగ్ ముగిసింది. ముజఫర్‌బాద్ డివిజన్‌లోని 9తో పాటు శరణార్థులకు కేటాయించిన 12 సీట్లకు ఆగస్టు 2, పూంచ్ డివిజన్‌లోని 11 స్థానాలకు ఆగస్టు 10న పోలింగ్ నిర్వహిస్తారు.

# రాజ్యాంగమే సర్వోన్నతం..

## ప్రభుత్వానికైనా, అధికారులకైనా అంతిమ అధికారం రాజ్యాంగానిదే!



ప్రజాస్వామ్య వ్యవస్థ మూడు ప్రధాన స్తంభాలపై నిలబడి ఉంటుంది. శాసన వ్యవస్థ చట్టాలను రూపొందిస్తుంది. కార్యనిర్వాహక వ్యవస్థ వాటిని అమలు చేస్తుంది. న్యాయవ్యవస్థ రాజ్యాంగాన్ని, చట్టాలను పరిరక్షిస్తూ అన్ని వ్యవస్థలు తమ పరిధిలో పని చేస్తున్నాయా లేదా అనే విషయాన్ని పర్యవేక్షిస్తుంది. ఈ మూడు వ్యవస్థలలో ఏ ఒక్కటి కూడా తన పరిధిని దాటి వ్యవహరించినా ప్రజాస్వామ్య సమతుల్యత దెబ్బతింటుంది. అందుకే భారత రాజ్యాంగ నిర్మాతలు చట్టబద్ధమైన (రూల్ ఆఫ్ లా) పాలన అనే సూత్రాన్ని ప్రజాస్వామ్యానికి ప్రాణంగా భావించారు. తెలంగాణ హైకోర్టులో హైడ్రా కమిషనర్ ఏ.వి.రంగనాథ్ వ్యవహారానికి సంబంధించిన పరిణామాలు పరిపాలనా వ్యవస్థలో రాజ్యాంగబద్ధ బాధ్యతలపై దేశవ్యాప్తంగా చర్చకు దారితీశాయి. కోర్టు ఉత్తర్వులను పదేపదే ఉల్లంఘించడం, కోర్టు ధిక్కరణ విచారణలను సైతం పట్టించుకోకపోవడం, న్యాయస్థానం వ్యక్తం చేసిన తీవ్ర అసంతృప్తి వంటి అంశాలు కేవలం ఒక అధికారి వ్యక్తిగత వ్యవహారంగా కాకుండా మొత్తం పరిపాలనా వ్యవస్థ బాధ్యతను ప్రశ్నించే పరిస్థితిని సృష్టించాయి.

భారతదేశంలో ఏ అధికారి అయినా, ఏ ప్రభుత్వం అయినా, ఏ సంస్థ అయినా రాజ్యాంగం కంటే గొప్పది కాదు. ప్రతి ఒక్కరూ ప్రధానంగా గుర్తుంచుకోవలసిన విషయమిది. ప్రభుత్వం జారీ చేసిన ఒక ఉత్తర్వు (జీవో) ద్వారా ఏర్పడిన సంస్థకు చట్టానికి అతీతమైన అధికారాలు లభించవు. జీవో అనేది శాసనసభ చేసిన చట్టానికి లోబడే ఉంటుంది. ఒక కార్యనిర్వాహక ఉత్తర్వు ద్వారా న్యాయస్థానాల అధికారాలు, చట్టబద్ధమైన శాఖల అధికారాలను పక్కన పెట్టే పరిస్థితి ఏర్పడితే అది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా మారుతుంది.

రాజ్యాంగంలోని అధికరణం-141 ప్రకారం సుప్రీంకోర్టు ప్రకటించిన న్యాయసూత్రాలు దేశంలోని అన్ని కోర్టులకు, ప్రభుత్వ అధికారులు కట్టుబడి ఉండాలి. అధికరణం-144 ప్రకారం దేశంలోని ప్రతి సివిల్ సర్వెంట్, న్యాయాధికారి సుప్రీంకోర్టుకు సహకరించాల్సిన బాధ్యత కలిగి ఉంటారు. ఇదే సూత్రం హైకోర్టుల తీర్పుల విషయంలో కూడా వర్తిస్తుంది. రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ అధికారి హైకోర్టు ఉత్తర్వులను గౌరవించి అమలు చేయాల్సిన రాజ్యాంగబద్ధ బాధ్యత కలిగి ఉంటారు. హైకోర్టు లేదా సుప్రీంకోర్టు ఒక ఆదేశం ఇచ్చిన తర్వాత దానిని అమలు చేయాలా వద్దా అనే నిర్ణయం ప్రభుత్వ అధికారికి ఉండదు. తప్పకుండా అమలు చేయడం విధి. వ్యక్తిగత అభిప్రాయాలు, రాజకీయ ఆదేశాలు, పరిపాలనా సౌలభ్యం ఏ కారణంతోనైనా కోర్టు ఉత్తర్వులను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించడం ప్రజాస్వామ్య వ్యవస్థనే బలహీనపరుస్తుంది. కోర్టు ధిక్కరణ చట్టం-1971 ప్రకారం కోర్టు ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా అమలు చేయకుండా ఉండటం సివిల్ ధిక్కరణగా పరిగణనలోకి వస్తుంది. ఈ చట్టం ఉద్దేశం అధికారులను శిక్షించడం మాత్రమే కాదు, న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని కాపాడటం. ఎందుకంటే కోర్టు తీర్పులు అమలుకాకపోతే న్యాయం కేవలం కాగితాలకే పరిమితమవుతుంది.

సుప్రీంకోర్టు పలు తీర్పుల్లో ఈ అంశాన్ని స్పష్టంగా పేర్కొన్నది. ప్రభుత్వ అధికారులు చట్టానికి అతీతులు కాదని, అధికారంలో ఉన్న వ్యక్తులు కోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తే ఆ అధికారి బాధ్యత మరింత ఎక్కువగా ఉంటుందని అత్యున్నత న్యాయస్థానం పదేపదే స్పష్టం చేసింది. ప్రభుత్వ యంత్రాంగం కోర్టు ఆదేశాలను నిర్లక్ష్యం చేయడం రాజ్యాంగ పాలనను బలహీనపరుస్తుందని వ్యాఖ్యానించింది.

సివిల్ సర్వెంట్ అంటే రాజకీయ నాయకుడి ప్రతినిధి కాదు, రాజ్యాంగ ప్రతినిధి. అందుకే ఆల్ ఇండియా సర్వీస్ (కండక్ట్) రూల్స్, 1968 ప్రకారం ప్రతి అధికారి నిజాయితీ, నిష్పాక్షికత, చట్టబద్ధతతో వ్యవహరించాల్సిన బాధ్యత కలిగి ఉంటారు. సేవా నియమాలు అధికారికి అధికారం ఇవ్వడమే కాదు, ఆ అధికార వినియోగానికి స్పష్టమైన పరిమితులను కూడా విధిస్తాయి. చట్టం అనుమతించిన మేరకే చర్యలు తీసుకోవాలి. చట్టం ఇవ్వని అధికారాన్ని స్వయంగా సృష్టించుకోవడానికి అవకాశం లేదు. హైడ్రా వంటి సంస్థల విషయంలో కూడా ఇదే సూత్రం వర్తిస్తుంది. ఒక జీవో ద్వారా ఏర్పాటు చేసిన సంస్థకు చట్టబద్ధమైన రెవెన్యూ అధికారాలపై పూర్తి ఆధిపత్యం ఉండదు. భూఆక్రమణల విషయంలో సంబంధిత చట్టాలు, రెవెన్యూశాఖ అధికారాలు, సహజన్యాయ సూత్రాలు అన్నీ పాటించాల్సిందే. నోటీస్ ఇవ్వకుండా, వినతులు వినకుండా, కోర్టు ఉత్తర్వులను పక్కనబెట్టి పరిపాలనా చర్యలు తీసుకోవడం రాజ్యాంగపరంగా నిలబడటం కష్టం.

ఇటువంటి సందర్భాల్లో అత్యంత ప్రమాదకరమైన పరిస్థితి ఏమిటంటే ప్రభుత్వ మద్దతు ఉన్నదనే భావనతో అధికారులు తమ అధికార పరిధిని దాటి వ్యవహరించడం. రాజకీయ నాయకత్వం మారుతుంది. ప్రభుత్వాలు మారుతాయి. కానీ సివిల్ సర్వెంట్ మాత్రం రాజ్యాంగానికి విధేయుడిగా కొనసాగాలి. అధికారికి రక్షణ కల్పించేది రాజకీయ నాయకత్వం కాదు, చట్టబద్ధమైన విధి నిర్వహణ మాత్రమే.

భారతదేశ పరిపాలనా చరిత్రలో ఎన్నో సందర్భాల్లో సుప్రీంకోర్టు ఈ విషయాన్ని స్పష్టం చేసింది. నేను ప్రభుత్వ ఆదేశాలు పాటించాను అనే కారణం కోర్టు ధిక్కరణకు రక్షణ కాదని పలు తీర్పులు పేర్కొన్నాయి. చట్టవిరుద్ధమైన ఆదేశాన్ని అమలు చేయకుండా ఉండటం కూడా ఒక ప్రభుత్వ అధికారి విధిలో భాగమే. భారత రాజ్యాంగం హైకోర్టులకు కేవలం వివాదాలను పరిష్కరించే అధికారాన్ని మాత్రమే ఇవ్వలేదు. అధికరణం- 215 ప్రకారం ప్రతి హైకోర్టు ఒక కోర్ట్ ఆఫ్ రికార్డ్. అంటే తన గౌరవాన్ని, తన ఆదేశాల అమలును కాపాడుకొనే స్వతంత్ర అధికారాన్ని కలిగి ఉంటుంది. కోర్టు ధిక్కరణకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకొనే అధికారం కూడా ఈ రాజ్యాంగ నిబంధన నుంచే ఉద్భవిస్తుంది. ఇది వ్యక్తిగతంగా న్యాయమూర్తి ప్రతిష్ఠను కాపాడేందుకు కాదు, న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని పరిరక్షించేందుకు.

కోర్టు ఒక ఉత్తర్వు ఇచ్చిన తర్వాత ప్రభుత్వ అధికారి దానిని అమలు చేయకుండా పదేపదే నిర్లక్ష్యం చేస్తే, అది ఒక వ్యక్తిపై జరిగిన అన్యాయం మాత్రమే కాదు, మొత్తం రాజ్యాంగ వ్యవస్థకే సవాలు చేసినట్టే. అందుకే సుప్రీంకోర్టు అనేక సందర్భాల్లో రూల్ ఆఫ్ లా అనేది భారత రాజ్యాంగపు ప్రాథమిక నిర్మాణంలో భాగమని స్పష్టం చేసింది. ప్రభుత్వాలు ప్రజల కోసం పనిచేయడానికి ఏర్పడుతాయి. అయితే ప్రభుత్వ ప్రతి చర్య కూడా చట్టానికి లోబడే ఉండాలి. కార్యనిర్వాహకశాఖ తనకు నచ్చిన విధంగా చట్టాలను అమలు చేయడం, లేదా కోర్టు ఉత్తర్వులను పక్కన పెట్టి చర్యలు తీసుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. ప్రభుత్వ ఉత్తర్వు (జీవో) ఒక చట్టానికి ప్రత్యామ్నాయం కాదు. అది చట్టానికి లోబడి ఉన్నంత వరకు మాత్రమే చెల్లుబాటు అవుతుంది.

భూపరిపాలన విషయంలో శాసనసభ రూపొందించిన రెవెన్యూ చట్టాలు స్పష్టంగా అధికారాలను నిర్దేశిస్తాయి. భూమి యాజమాన్యం, ఆక్రమణ, సర్వే, రికార్డుల సవరణ, స్వాధీనం వంటి అంశాలకు సంబంధించి ఏ శాఖకు ఏ బాధ్యత అనే విషయం చట్టం నిర్ణయిస్తుంది. అలాంటి పరిస్థితిలో ఒక కార్యనిర్వాహక సంస్థ తన పరిధిని దాటి ఇతర శాఖల చట్టబద్ధ అధికారాలను నిర్వీర్యం చేస్తే, అది న్యాయపరమైన ప్రశ్నలను లేవనెత్తడం సహజం.

ఆల్ ఇండియా సర్వీస్ రూల్స్ ప్రకారం ఒక ఐఏఎస్ లేదా ఐపీఎస్ అధికారి ప్రజాప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకొని, చట్టబద్ధంగా, నిష్పాక్షికంగా, సమగ్రతతో వ్యవహరించాలి. అధికార వినియోగం ఎప్పుడూ చట్టబద్ధమైన పరిమితుల్లోనే ఉండాలి. ప్రభుత్వం ఒక చర్య తీసుకోవాలని చెప్పిందనే కారణంతో చట్టవిరుద్ధమైన ఆదేశాలను అమలు చేయడానికి రూల్స్ అనుమతి ఇవ్వలేదు. ప్రభుత్వాలు మారినప్పుడు కూడా ఆ అధికారులే పనిచేస్తారు. కాబట్టి వారి విధేయత వ్యక్తులకు కాదు; రాజ్యాంగానికి లోబడి ఉండాలి. న్యాయవ్యవస్థ తరచూ చెప్పే ఒక ముఖ్యమైన సూత్రం ఏమిటంటే, అధికారం ఎంత ఎక్కువగా ఉంటే, బాధ్యత కూడా అంత ఎక్కువగా ఉంటుంది. ప్రజల ఆస్తి, నివాసం, జీవనోపాధిపై ప్రభావం చూపే అధికారాన్ని వినియోగించే ప్రతి అధికారి కూడా అత్యంత జాగ్రత్తగా, చట్టబద్ధంగా వ్యవహరించాలి. లేకపోతే ప్రజాస్వామ్యంలో అధికారంపై ప్రజల విశ్వాసం దెబ్బతింటుంది. ఈ మొత్తం పరిణామం నుంచి ప్రభుత్వాలు కూడా ఒక పాఠం నేర్చుకోవాలి. చట్టబద్ధమైన పరిమితుల్లో పనిచేసే అధికారిని ప్రభుత్వం రక్షించడం సహజం. కానీ కోర్టు ఆదేశాలను ఉల్లంఘించిన చర్యలను సమర్థించడం, న్యాయవ్యవస్థతో ఘర్షణకు దారితీసే పరిస్థితులను సృష్టించడం ప్రజాస్వామ్య పరిపాలనకు అనుకూలం కాదు. న్యాయవ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థ పరస్పర గౌరవంతో పనిచేసినప్పుడే రాజ్యాంగ వ్యవస్థ బలపడుతుంది. ఈ వ్యవహారంలో చివరికి గుర్తుంచుకోవాల్సిన గొప్ప సత్యం ఒక్కటే.

ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ప్రభుత్వానికి పనిచేస్తారు. కానీ ప్రభుత్వ రాజకీయ కార్యక్రమాలను అమలు చేయడానికి కాదు, రాజ్యాంగం, చట్టాలు నిర్దేశించిన పరిమితుల్లో ప్రజా పరిపాలన నిర్వహించడానికి పనిచేస్తారు. మంత్రి లేదా ముఖ్యమంత్రి ఇచ్చిన ప్రతీ ఆదేశం చట్టబద్ధమని భావించడం సివిల్ సర్వీస్ నైతికత కాదు. చట్టవిరుద్ధమైన ఆదేశాన్ని అమలు చేయకుండా ఉండటమే నిజమైన రాజ్యాంగ విధేయత.జుఇవఎెబఅజవ దీతీుఅఎెష్ట్ర

సుప్రీంకోర్టు సోమేశ్ తివారీ వర్సెస్ యూనియన్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా (2009) కేసులో 'అధికార వినియోగం ఎప్పుడూ ప్రజాప్రయోజనానికి అనుగుణంగా ఉండాలి' అని స్పష్టం చేసింది. ప్రభుత్వ సంస్థలకు చట్టం ఇచ్చిన అధికారాలు ప్రజల హక్కులను రక్షించడానికి మాత్రమే. ప్రజల హక్కులను హరించడానికి కాదు.

ప్రస్తుత పరిణామాలు మరో కీలకమైన ప్రశ్నను కూడా లేవనెత్తుతున్నాయి. ప్రభుత్వ ఉత్తర్వు ద్వారా ఏర్పడిన సంస్థకు శాసనసభ రూపొందించిన చట్టాల కంటే ఎక్కువ అధికారం ఎలా ఉంటుంది? ఒక జీవో ద్వారా రెవెన్యూశాఖ, మున్సిపల్, పోలీస్‌శాఖలు, ఇతర చట్టబద్ధ అధికార వ్యవస్థలన్నింటినీ పక్కనపెట్టే విధంగా అధికార కేంద్రీకరణ జరిగితే, అది రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణమా? ఈ ప్రశ్నకు సమాధానం చివరికి కోర్టులే చెప్తాయి. కానీ ఈ ప్రశ్న తలెత్తడమే పరిపాలనా వ్యవస్థ ఆత్మపరిశీలన చేయాల్సిన అవసరాన్ని సూచిస్తుంది. రాజకీయ నాయకత్వం కూడా ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలి. తాత్కాలిక రాజకీయ ప్రయోజనాల కోసం చట్టపరమైన పరిమితులను నిర్లక్ష్యం చేయడం చివరికి ప్రభుత్వానికే నష్టం చేస్తుంది. భారత రాజ్యాంగం ప్రభుత్వం మీద అపారమైన విశ్వాసాన్ని ఉంచింది. అదే సమయంలో న్యాయవ్యవస్థకు రాజ్యాంగ సంరక్షక పాత్రను అప్పగించింది. ఈ రెండు వ్యవస్థలు పరస్పర గౌరవంతో పనిచేసినప్పుడే ప్రజాస్వామ్యం బలపడుతుంది.

న్యాయస్థానాలను ధిక్కరించి ఏ ప్రభుత్వమూ శాశ్వతంగా విజయం సాధించలేదు. చట్టాన్ని అతిక్రమించి ఏ అధికారమూ చిరస్థాయిగా నిలబడలేదు. అందుకే ప్రతి సివిల్ సర్వెంట్ తన కార్యాలయంలో ఒక వాక్యాన్ని రాసి పెట్టుకోవాలి. 'నా విధేయత వ్యక్తికి కాదు, పదవికి కాదు, ప్రభుత్వానికి కూడా కాదు, నా మొదటి, చివరి విధేయత భారత రాజ్యాంగానికే. ఇష్టారాజ్యం అంటే నడువదు.. రాజ్యాంగమే సర్వోన్నతం. అదే నిజమైన అఖిల భారత సర్వీసుల ఆత్మ. అదే ప్రజాస్వామ్య పరిపాలనకు మూలస్తంభం. న్యాయపాలనకు శాశ్వత హామీ'.

# కాక్ రోచ్‌కు నిధులపై ఆరా

**న్యూఢిల్లీ :** కావలసినంత ఆహారం వచ్చింది. డ్రై ఫ్రూట్స్ ఊహించని విధంగా వచ్చాయి. మెడికల్ కిట్లు.. ఫాస్ట్ ఫుడ్.. డ్రింక్స్.. టెంట్లు.. రాళ్లు.. రప్పలు.. ఇవన్నీ ఆకాశరామన్న పంపించినట్టు పరుగులు పెట్టుకుంటూ వచ్చాయి. అసలు ఇవన్నీ ఎవరిచ్చారు.. ఎక్కడి నుంచి వచ్చాయి.. ఇంత ఖర్చు ఎవరు భరించారు.. అసలు ఆ పార్టీకి ఒక రూపం అంటూ లేదు. కనీసం క్షేత్రస్థాయిలో నిర్మాణం లేదు. కార్యకర్తలు లేరు. కేవలం సోషల్ మీడియా వేదికగా జరిగిన ప్రచారం ద్వారానే ఇంతటి ఉద్యమం పుట్టింది. మరి ఈ ఉద్యమం వెనుక ఉన్నది ఎవరు.. ఇప్పుడు ఈ విషయాలను బయట పెట్టే పనిలో పడ్డారు కేంద్ర దర్యాప్తు సంస్థల అధికారులు.కాక్రోచ్ జనతా పార్టీ లో అధికార ప్రతినిధిగా సౌరవ్ దాస్ కొనసాగుతున్నారు. ఈయనకు సంబంధించి బ్యాంక్ ఖాతా వివరాలను దర్యాప్తు సంస్థల అధికారులు పరిశీలిస్తున్నారు. ఈ నేపథ్యంలో వారికి దిమ్మ తిరిగిపోయే నిజాలు తెలిసిపోయాయి. దీంతో కాక్రోచ్ జనతా పార్టీ వ్యవహారంలో అసలు కోణం వేరే ఉందని తెలుస్తోంది. భారతీయ జనతా పార్టీ నాయకులు.. జాతీయ వాదులు అనుమానించినట్టుగానే.. దీని వెనక పెద్ద వ్యవహారం సాగిందని.. విదేశీ శక్తులు ఉన్నాయని ఇప్పుడు తెలుస్తోంది.సౌరవ్ దాస్ ఖాతాలో కొన్ని సంవత్సరాలుగా లక్షల డాలర్లు జమవుతున్నాయి. ఆమధ్య ఆయనకు 30 మిలియన్ డాలర్లు ఇచ్చేందుకు ఓ సంస్థ ముందుకు వచ్చిందని సమాచారం. అయితే ఆ డబ్బులు ఆయన ఖాతాలో పడలేదని తెలుస్తోంది. 16 మిలియన్ డాలర్లను నార్వేజియన్ ఏజెన్సీ ఫర్ డెవలప్మెంట్ కో ఆపరేటివ్ నో రాడ్ అనే సంస్థ ఇచ్చినట్టు సమాచారం. 2.4 మిలియన్ డాలర్లను లీడ్స్ ఫౌండేషన్ ఇచ్చినట్టు సమాచారం. తొమ్మిది లక్షల డాలర్లను ఓపెన్ సొసైటీ అనే సంస్థ ఇచ్చినట్టు తెలుస్తోంది.ఈ స్థాయిలో డాలర్ల సొమ్ము రావడంతోనే ఉద్యమాన్ని ఈ స్థాయిలో నిర్వహించగలిగారని జాతీయవాదులు ఆరోపిస్తున్నారు. పైగా ఆయనకు 30 మిలియన్ డాలర్లు ఇస్తామని ఒక సంస్థ ఈమెయిల్ ద్వారా సమాచారం పంపించడం దర్యాప్తు సంస్థల అధికారులను కలవరపాటుకు గురి చేస్తోంది. ఎక్కడో విదేశాల్లో ఉన్న వ్యక్తులు.. ఇక్కడ ఉద్యమాలకు డబ్బు ఇవ్వడం ఏంటనేది అర్థం కావడం. మరోవైపు బొద్దింకలు ఆందోళనలు చేస్తున్నప్పుడు కెనడా వేదికగా కార్యాలపాలు సాగించే ఖలిస్థాన్ వేర్పాటు వాదులు తెర ముందుకు వచ్చారు. ఇండియాలో ఇదే స్థాయిలో ఆందోళనలు చేస్తే భారీగా డబ్బులు ఇస్తామని ప్రకటించారు. దీనినిబట్టి కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ఆందోళనల వెనుక విదేశీ శక్తులు ఉన్నాయని అర్థమవుతోంది.కేవలం డబ్బులు మాత్రమే కాకుండా ఆందోళనలు జరుగుతున్నప్పుడు అక్కడి యువత కోసం భారీగా ఆహారం వచ్చింది. దుస్తులు కూడా వచ్చాయి. ఇక రాళ్లు.. మెడికల్ కిట్లు.. డబ్బుల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అయితే ఇదంతా కూడా విదేశీ శక్తుల కుట్ర అని.. వారి మాయలో పడి మన విద్యార్థులు నాశనం కాకుండా ఉండడానికే ప్రభుత్వం ముందుగానే జాగ్రత్త పడిందని.. విద్యాశాఖ మంత్రితో రాజీనామా చేయించిందని జాతీయ వాదులు అభిప్రాయపడుతున్నారు. వచ్చే రోజుల్లో ఈ విచారణ మరింత వేగవంతంగా సాగితే అసలు నిజాలు బయటికి వస్తాయని.. అప్పుడు ముసుగు వీరులు.. కుట్ర వీరులు.. విదేశీ శక్తుల చేతిలో తొత్తులుగా మారిన వారు బయటపడతారని జాతీయవాదులు చెబుతున్నారు

## సంపాదకీయం

# విశ్వాస అవిశ్వాసం!

నెలకు పైగా సాగిన యువత ఆందోళనలు -చివరకు దేశ విద్యా వ్యవస్థ సంస్కరణలపై దీర్ఘకాలంగా వాయిదా పడుతూ వచ్చిన రాజకీయ దృష్టిని కదిలించాయి. కేంద్రం.. ఉన్నతస్థాయి టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు నిర్ణయం- లక్షలాది యువత భవితవ్యాన్ని నిర్దేశించే వ్యవస్థపై నెలకొన్న విశ్వాస సంక్షోభాన్ని అంగీకరించడమే! టాస్క్‌ఫోర్స్‌లో సాంకేతిక నిపుణులు, విద్యావేత్తలు, మాజీ అధికారులు ఉండటం- ప్రభుత్వం తక్షణ సంక్షోభ నివారణకు మించి ఆలోచిస్తోందని సూచిస్తోంది. ఈ కమిటీకి ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని నేతృత్వం వహించడం సంతోషదాయకం. గత కొన్నేళ్లుగా నీట్-యూజీ, నెట్‌వంటి జాతీయ స్థాయి పరీక్షల్లో పేపర్ లీకేజీలు పదేపదే వార్తల్లోకి ఎక్కడం వల్ల, ఎన్టీఏ పట్ల విశ్వాసం సన్నగిల్లింది. ఒక విద్యార్థి సంఘం నేతృత్వంలో మొదలైన ఉద్యమం, పరీక్ష రద్దునో, అధికారి బదిలీనో కోరకుండా.. మొత్తం వ్యవస్థనే సమూలంగా ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేయడం- యువత ఓర్పు నశించిపోయిందనడానికి సంకేతం! అయితే, కేవలం పేరున్న వ్యక్తిని ఛైర్మన్‌గా నియమించడం ఒక్కటే సరిపోదు.. కమిటీకి తగినంత స్వయంప్రతిపత్తి, వనరులు, స్పష్టమైన కార్యక్షేత్రం ఇవ్వడం కూడా ముఖ్యం. గతంలో ఏర్పాటైన అనేక కమిటీలు మంచి సిఫార్సులు ఇచ్చినా, అమలుకు అవసరమైన రాజకీయ సంకల్పం లోపించడం వల్ల ఆచరణలో నీరుగారిపోయిన సందర్భాలు కోకొల్లలు.

ఇటీవలి ఆందోళనలకు తక్షణ కారణం పరీక్షల్లో పదేపదే జరిగిన వైఫల్యాలే అయినా, దాని వెనుక ఒక పెద్ద ప్రశ్న దాగి ఉంది. ప్రపంచ ఉద్యోగ రంగం సమూలంగా మారుతున్న తరుణంలో.. దేశ విద్యా వ్యవస్థ నిజంగా అవకాశాల తలుపులు తెరుస్తోందా? అన్నది. కృత్రిమ మేధ శ్వేతవర్ణ ఉద్యోగాలను పునర్నిర్మిస్తోంది. ఆటోమేషన్ యజమానులు కోరుకునే నైపుణ్యాలను మారుస్తోంది. భారత ఐటీ, అవుట్‌సోర్సింగ్ పరిశ్రమలు సాంకేతిక అంతరాయాల దశలోకి ప్రవేశిస్తున్నాయి. యువత ఇప్పుడు రెండు రకాల అనిశ్చితిని ఎదుర్కొంటోంది. పదేపదే విశ్వసనీయతను కోల్పోతున్న పరీక్షా వ్యవస్థ ఒకవైపు, వేగంగా మారుతున్న శ్రామిక మార్కెట్ మరోవైపు. ఉదాహరణకు, గతంలో ఐటీ ఉద్యోగం పొందాలంటే కేవలం కోడింగ్ నైపుణ్యం చాలు అనుకున్నారు. కానీ ఇప్పుడు ఏఐ టూల్స్ బేసిక్ కోడింగ్ పనులను తానే చేసేస్తున్నందున, ఉన్నతస్థాయి నైపుణ్యాలు నేర్చుకోవడం తప్పనిసరిగా మారింది. ఇక్కడే నీలేకని ఉనికి ప్రాముఖ్యతను సంతరించుకుంటుంది. డిజిటల్ మౌలిక సదుపాయాలు, నైపుణ్యాభివృద్ధి, నిరంతర అభ్యాసంలో పెట్టుబడులు ఏఐని ఉద్యోగాల గుణకారిగా మార్చగలవని, ఏఐ భారత అవుట్‌సోర్సింగ్ పరిశ్రమను పునర్నిర్మిస్తుందని, వృత్తి నిపుణులు ఉన్నత విలువ కలిగిన నైపుణ్యాలవైపు మళ్లడం అనివార్యమని ఆయన నిత్యం వాదిస్తూ వచ్చారు. ఒక గ్రామీణ ప్రాంతంలోని విద్యార్థి కేవలం పాఠ్యపుస్తక జ్ఞానంతో మాత్రమే పోటీ పడలేడు; అతనికి డిజిటల్ నైపుణ్యాలు, సమస్య పరిష్కార సామర్థ్యం కూడా అవసరం. మరో కోణంనుంచి చూస్తే, భారత ఐటీ, బీపీవో పరిశ్రమలు దశాబ్దాలుగా లక్షలాది గ్రాడ్యుయేట్లకు ఉపాధి కల్పిస్తూ వచ్చాయి. అయితే జెనరేటివ్ ఏఐ సాధనాలు ప్రాథమిక స్థాయి కోడింగ్, డేటా ఎంట్రీ, కస్టమర్ సపోర్ట్‌వంటి పనులను వేగంగా ఆటోమేట్ చేస్తున్న నేపథ్యంలో, ఈ పరిశ్రమలపై ఆధారపడిన లక్షలాది యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారే ప్రమాదముంది. అందుకే విద్యా వ్యవస్థ సంస్కరణలను కేవలం పరీక్షా భద్రతకే పరిమితం చేయకుండా, పాఠ్యాంశాల్లో డిజిటల్ అక్షరాస్యత, విమర్శనాత్మక ఆలోచన, సమస్య పరిష్కార నైపుణ్యాలను భాగం చేయడం అవసరం. కొన్ని రాష్ట్రాల్లో పాఠశాల స్థాయిలో కోడింగ్, ఏఐ బేసిక్స్ బోధించే ప్రయత్నాలు మొదలైనా, దేశవ్యాప్తంగా ఏకరీతిగా అమలు కాకపోవడం లోటుగా మిగిలిపోయింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య డిజిటల్ అంతరం కూడా కీలకమైన అంశం. ఫలితంగా, డిజిటల్ నైపుణ్యాల ఆధారంగా జరిగే భవిష్యత్ ఎంపిక ప్రక్రియలు అసమానతలను మరింత పెంచే ప్రమాదముంది. అలాగే, పరీక్షల భద్రతపైనే కాకుండా, విద్యార్థుల మానసిక ఆరోగ్యంపైనా దృష్టి సారించాలి. పదేపదే వైఫల్యాలు, ఉద్యోగ భద్రత లేమి భయం యువతలో తీవ్ర ఒత్తిడి కలిగిస్తున్నాయని పలు అధ్యయనాలు స్పష్టం చేశాయి.

ఇది సాధ్యం కావాలంటే, ప్రభుత్వం టాస్క్‌ఫోర్స్‌ను సూపర్ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీగా చిత్రీకరించే ప్రలోభాన్ని నిరోధించుకోవాలి. బదులుగా, దీని పనిని విస్తృత సంస్కరణలకు నాంది పలికే మొదటి అడుగుగా చూడాలి. స్పష్టమైన కాలవ్యవధులు, కొలవదగిన మైలురాళ్లు జతచేయాలి. 2024లో నీట్-యూజీ పరీక్ష వైఫల్యం తర్వాత ఏర్పాటైన కె రాధాకృష్ణన్ కమిటీ నివేదిక సమర్పించిన తర్వాత జరిగిన తాత్సారాన్ని ప్రభుత్వం మళ్లీ పునరావృతం చేయకుండా జాగ్రత్త వహించాలి. ఆ కమిటీ దాదాపు 37 వేలమంది విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి అభిప్రాయాలు సేకరించి, 2024 అక్టోబరులో 101 సిఫార్సులను సమర్పించింది, జవాబుదారీతనం, సంస్థాగత పునర్నిర్మాణం, సాంకేతిక నవీకరణలతో సహా. అయితే ఈ సిఫార్సుల్లో అత్యధిక భాగం అసమానంగానే అమలైనట్టు కనిపిస్తోంది- కొన్ని రాష్ట్రాల్లో డిజిటల్ కేంద్రాలు ఏర్పాటైనా, దేశవ్యాప్తంగా ఏకరీతి అమలు కలగానే మిగిలిపోయింది. గత వారం వీధుల్లోకి వచ్చిన ఆగ్రహావేశాలు- పాత పద్ధతులు ఇక పనిచేయవన్న హెచ్చరికగా సరిపోతాయి. నీలేకని టాస్క్‌ఫోర్స్ కేవలం కొత్త సిఫార్సులు ఇవ్వడమే కాకుండా, ఇప్పటికే ఉన్న సిఫార్సుల అమలును వేగవంతం చేసే బాధ్యత కూడా తీసుకోవాల్సి ఉంటుంది. లేకపోతే, ఒక కమిటీ నివేదిక తర్వాత మరో కమిటీ ఏర్పాటు చేయడం అనే చక్రం కొనసాగుతూనే ఉంటుంది. కేంద్రం మాత్రమే కాకుండా రాష్ట్ర ప్రభుత్వాలు, విద్యాసంస్థలు, ఉపాధ్యాయులు కూడా సంస్కరణల్లో భాగస్వాములవ్వాలి. పార్లమెంటులో ప్రవేశపెట్టనున్న పేపర్ లీక్ నిరోధక బిల్లు ఈ సంస్కరణలకు చట్టపరమైన బలాన్ని చేకూర్చే అవకాశం ఉంది. అయితే కేవలం శిక్షలు కఠినతరం చేయడం ద్వారానే సమస్య పరిష్కారం కాదు, వ్యవస్థాగత లొసుగులను మూసివేయడం మరింత ముఖ్యం. అంతిమంగా, విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న ఈ అంశంలో రాజకీయ చిత్తశుద్ధి, పరిపాలనా సామర్థ్యం రెండూ సమానంగా అవసరం. నీలేకని నేతృత్వంలోని ఈ టాస్క్‌ఫోర్స్ ఎంతవరకు ఫలితాలు ఇస్తుందన్నది భవిష్యత్తులో తేలనున్నా, ప్రస్తుతానికి ఇది సరైన దిశలో వేసిన అడుగుగానే చెప్పుకోవచ్చు. యువత ఓపిక నశించిపోయిన ఈ తరుణంలో, మాటలు కాకుండా చేతల్లో ఫలితాలు కనిపించాల్సిన సమయం ఆసన్నమైంది.

## పనికొచ్చే పలుకు



# విలువలకు పదును పెడదాం!

ఉప్పుకప్పురంబు ఒక్కపోలికనుండు/ చూడచూడ రుచుల జాడ వేరు/ పురుషులందు పుణ్య పురుషులు వేరయా/ విశ్వదాభిరామ వినురవేమ

వేమన.. తన పద్యాల్లో సంక్లిష్టమైన తత్వాన్ని సామాన్యమైన ఉదాహరణలతో వివరిస్తాడు. ఉప్పు, కర్పూరం- రెండూ చూడ్డానికి తెల్లగా, స్ఫటికాల్లా ఉన్నా.. రుచి చూస్తే తేడా తెలుస్తుంది. ఒకటి ఘాటుగా, మరొకటి పరిమళభరితంగా ఉంటుంది. అలాగే మనుషులంతా బయటకు ఒకేలా కనిపించినా, లోపలి గుణం, నడవడిక వేరన్నది వేమన చెప్పిన సత్యం. నిజమైన మనిషిని రూపం, హోదా, వేషభాషలు కాక ప్రవర్తన, విలువలే నిర్వచిస్తాయన్నది పద్యం చెప్పే నీతి. నాలుగు వందల ఏళ్ల నాటి ఈ భావన.. నేటి జీవనశైలికీ ఎంతగానో వర్తిస్తుంది. ప్రస్తుత సమాజంలో మనం చాలావరకు అలంకరణలు.. హంగులకే ప్రాధాన్యమిస్తున్నాం. ఖరీదైన దుస్తులు, సోషల్ మీడియాలో మెరుగైన చిత్రాలు, పలుకుబడి ఉన్నట్టు కనిపించే మాటతీరు- వీటన్నింటినీ చూసి మనుషుల్ని అంచనా వేసే ధోరణి పెరిగింది. కానీ నిజ జీవితంలో సంక్షోభ సమయంలో పక్కన నిలబడేది, నిజాయితీగా వ్యవహరించేది, మాట తప్పకుండా ఉండేది- ఇలాంటి లోతైన గుణాలే. ఇవే మనిషిని నిజంగా ఎత్తులకు తీసుకెళ్తాయి.

లైఫ్‌స్టయిల్ మార్చుకోవాలనుకునే వారికి ఈ పద్యం ఒక దిక్సూచి. ముందుగా, మనం ఇతరులను బాహ్యరూపాన్ని బట్టి కాకుండా వారి గుణగణాలను బట్టి అంచనా వేయడం నేర్చుకోవాలి. అలాగే, మనల్ని మనం కూడా కేవలం బయటి హంగుల ద్వారా కాక, మన అంతరంగంలో ఉన్న విలువల ద్వారా మెరుగుపర్చుకోవాలి. అంటే, రోజువారీ జీవితంలో నిజాయితీ, కృతజ్ఞత, సహనంవంటి గుణాలను పెంపొందించుకోవడం మీద దృష్టి పెట్టాలి. కేవలం సోషల్ మీడియాలో "మంచి జీవితం" చూపించడం కాకుండా, నిజంగా మంచి మనిషిగా మారడానికి ప్రయత్నించాలి.

ఉదాహరణకు, ఉద్యోగంలో ఒక వ్యక్తి పైకి ఎంత తెలివైనవాడిలా కనిపించినా, అతని పనితీరులో నిజాయితీ లేకపోతే ఎక్కువ కాలం విశ్వసనీయత నిలబెట్టుకోలేడు. అదే విధంగా, స్నేహాల్లోనూ బయటి మాటలకు, హావభావాలకు మోసపోకుండా, నిజమైన అనుబంధాన్ని గుర్తించే వివేకం అవసరం. కుటుంబ సంబంధాల్లో సైతం ఆర్భాటాల కంటే ఆప్యాయత, పరస్పర విశ్వాసమే బలమైన పునాదిని ఏర్పరుస్తాయి.

ఈ పద్యం మనకు మరో ముఖ్యమైన పాఠం కూడా నేర్పుతుంది. తొందరపాటు నిర్ణయాలు వద్దని. ఎవర్నైనా మొదటి చూపులోనే అంచనా వేయడం సరికాదు. సమయం, అనుభవం ద్వారానే ఒక వ్యక్తి నిజ స్వరూపం బయటపడుతుంది. ఇది వ్యాపార భాగస్వాములను ఎంచుకునేటప్పుడు, జీవిత భాగస్వామిని ఎంచుకునేటప్పుడు కూడా వర్తిస్తుంది.

చివరిగా, వేమన తన పద్యంతో మనకొక సవాలు విసిరాడు కూడా. మనం కూడా "పుణ్య పురుషుల" జాబితాలో చేరాలంటే, బయటకు మంచిగా కనిపిస్తే సరిపోదు. లోపల నిజంగా మంచితనాన్ని పెంపొందించుకోవాలని. అదే నిజమైన లైఫ్‌స్టయిల్ మార్పు -బాహ్య ప్రదర్శన నుంచి అంతర్గత పరివర్తనకు మారడం. ఈ సూత్రాన్ని అనుసరిస్తే, జీవితంలో నిలకడైన, అర్థవంతమైన విజయాన్ని సాధించడం అసాధ్యం కాదు!

# మానవ సంబంధాల ముక్కోణం!?



మనుషుల ప్రవర్తన గురించి, వారి ఉద్దేశాల గురించి, వైఫల్యాల గురించి, తీసుకునే నిర్ణయాల గురించి మనం నిత్యం చర్చించుకుంటూనే ఉంటాం. కార్యాలయాల్లో, కుటుంబాల్లో, స్నేహాల్లో, బహిరంగ జీవితంలో- ఎక్కడ చూసినా మనుషుల ప్రవర్తనను విశ్లేషించే సంభాషణలే ఎక్కువగా వినిపిస్తాయి. కొందరైతే జీవితమంతా ఇదే విశ్లేషణలో గడిపేస్తారు. మనస్తత్వ శాస్త్రవేత్తలు, కౌన్సెలర్లు, నిర్వహణ నిపుణులు- వీరందరి కెరీర్లే మనుషుల ప్రవర్తనను అర్థం చేసుకోవడం చుట్టూ నిర్మితమై ఉంటాయి. అయినప్పటికీ, ఇంతటి లోతైన విశ్లేషణ తర్వాత కూడా మనం మళ్లీ మళ్లీ అవే సమస్యల్లో చిక్కుకుంటున్నాం. ఆఫీసులో అదే గొడవలు, ఇంట్లో అదే అపార్థాలు, స్నేహాల్లో అదే దూరాలు పునరావృతమవుతూనే ఉంటాయి. దీనికి కారణం- మనం అడుగుతున్న ప్రశ్నే తప్పు కావచ్చు! మనం ఎప్పుడూ "ఆ మనిషి ఎందుకిలా చేశాడు?" అని అడుగుతాం తప్ప, "ఈ ఇద్దరి మధ్య ఏం జరిగింది?" అని అడగం. ఉదాహరణకు, ఒక ఉద్యోగి తన బాస్‌తో మాట్లాడేటప్పుడు ఎప్పుడూ బిగుసుకుపోతాడు అనుకుందాం. మనం వెంటనే "అతనికి ఆత్మవిశ్వాసం లేదు" అని ముద్రవేస్తాం. కానీ నిజానికి సమస్య ఆ ఉద్యోగిలో కాదు, వారిద్దరి మధ్య గతంలో జరిగిన ఒక సంఘటనలో, చెప్పకుండా వదిలేసిన ఒక మాటలో ఉండి ఉండొచ్చు. అసలు సమస్య మనుషుల్లో లేదు; వారి మధ్య ఉండే అదృశ్య నిర్మాణంలో ఉంది. సంబంధాలను నిలబెట్టేది లేదా నిశ్శబ్దంగా కూలదోసేది ఈ నిర్మాణమే! ఇది కంటికి కనిపించదు, కానీ ప్రతి పరస్పర వ్యవహారానికీ పునాదిలా పనిచేస్తుంది. దీనికి మూడు మూలస్తంభాలు ఉంటాయి- సంబంధం, సత్యం, నైతికత. ఒక భవనానికి పునాది, గోడలు, పైకప్పు ఎలా ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉంటాయో, అలాగే ఈ మూడు అంశాలూ పరస్పరం ఆధారపడి ఉంటాయి. వీటిలో ఏ ఒక్కటి బలహీనపడినా, నిర్మాణమే కూలిపోతుంది!

కొన్ని బృందాలు అపారమైన అనుబంధంతో, ఏళ్ల తరబడి కలిసి పనిచేస్తుంటాయి. అందరూ కలిసి భోజనం చేస్తారు. పుట్టినరోజులు జరుపుకుంటారు. ఒకరి కష్టంలో ఒకరు నిలబడతారు. అయినా.. కీలకమైన సత్యమొక్కటి రహస్యంగా ఉండిపోతుంది. ఉదాహరణకు, ఒక సహోద్యోగి పని సరిగా చేయకపోయినా, "సంబంధం చెడిపోతుందేమో" అన్న భయంతో ఎవరూ ఆ విషయం ఎత్తరు. మొదట్లో ఈ మౌనం రక్షణాత్మకంగానే అనిపిస్తుంది. కానీ కాలక్రమేణా అదే మౌనం లోలోపల కుళ్లిపోతుంది- నలుగురిలో అసంతృప్తి పేరుకుపోతుంది. పని భారం అసమానంగా పంచుకోబడుతుంది. చివరికి చిన్న విషయానికే పెద్ద గొడవ జరిగిపోతుంది. అది బయటపడేసరికి, రక్షించాలనుకున్న సంబంధమే ఖాళీగా మిగిలిపోతుంది. వాయిదా వేసిన సత్యం, వెంటనే చెప్పివుంటే జరిగే నష్టంకంటే ఎక్కువ నష్టం కలిగిస్తుంది. కుటుంబాల్లోనూ ఇదే జరుగుతుంది. తల్లిదండ్రులు తమ పిల్లల తప్పును సరిదిద్దకుండా, "పాపం, చిన్నపిల్లాడు కదా" అని వదిలేస్తే, ఆ తప్పు పెద్దయ్యాక పెద్ద సమస్యగా మారుతుంది. దీనికి పూర్తి వ్యతిరేకమైన పరిస్థితీ ఉంది. అది -కొందరు సత్యాన్ని మొరటుగా, నిర్దాక్షిణ్యంగా ఉపయోగిస్తారు. "నేను నిజాయితీపరుడిని, ఏదైనా ముఖంమీద చెప్తాను" అని గర్వంగా చెప్పుకుంటూ, ఎదుటివారి మనసు గాయపడినా పట్టించుకోరు. ఉదాహరణకు, స్నేహితుడి కొత్త వ్యాపార ఆలోచనను చూసి, "ఇది వేస్టు, పనికిరాదు" అని నేరుగా అనేయడం. అది నిజమే కావచ్చు, కానీ చెప్పే విధానంలో కరుణ లేకపోతే అది బంధాన్ని దెబ్బతీస్తుంది. సాంకేతికంగా చూస్తే వారి మాట నిజమే కావచ్చు, కానీ నైతికంగా అది ప్రశ్నార్థకమే.. సంబంధపరంగా అది విధ్వంసకరమే! శ్రద్ధ లేని సత్యం సుగుణం కాదు- అది ముసుగు వేసుకున్న పరుషత్వం మాత్రమే. ఈ రెండు తీవ్రతల మధ్యే అసలైన సవాలు దాగి ఉంది. మౌనం ఎప్పుడు రక్షణగా మారి విషంగా మారుతుందో, నిష్కర్ష ఎప్పుడు నిజాయితీ నుంచి క్రూరత్వానికి జారిపోతుందో గుర్తించడమే అసలైన వివేకం! ఈ రెంటి మధ్య ఉండే సున్నితమైన సమతూకాన్ని కాపాడుకోవడంలోనే మానవ సంబంధాల విజయం దాగి ఉంది. అది అంత సులువైన పని కాదు. ఒక వైద్యుడు రోగికి కఠినమైన నిజం చెప్పాల్సి వచ్చినప్పుడు, ఎంత సున్నితంగా, కరుణతో చెప్తాడో.. మనం కూడా దైనందిన సంబంధాల్లో సమతూకాన్ని సాధన చేయాలి.

మూడు మూలస్తంభాల్లో నైతికత అనేది బహుశా అందరూ ఎక్కువగా అపార్థం చేసుకునేది. వాస్తవానికి నైతికత అంటే ఒక నియమావళి కాదు, అదొక సమతూకం. ఎవరు ఇందులో భాగస్వాములు, ఎంత మూల్యం చెల్లించాల్సి వస్తుందన్న ప్రశ్నలను వేస్తుంది. ఉదాహరణకు, ఒక మేనేజర్ తన బృందంలో ఒక సభ్యుడిని తప్పించాలనుకున్నప్పుడు- కేవలం నియమాల ప్రకారం మాత్రమే ఆలోచిస్తే అది కఠినంగా ఉంటుంది. కానీ ఆ వ్యక్తి పరిస్థితిని, అతని కుటుంబ బాధ్యతలను కూడా పరిగణలోకి తీసుకుని నిర్ణయం తీసుకుంటే అది నిజమైన నైతికత అవుతుంది. కేవలం నియమాల ప్రకారమే వ్యవహరిస్తే, భావోద్వేగాలను పట్టించుకోని యంత్రాల్లా మారిపోతాం. సత్యం లేని నైతికత కేవలం ప్రదర్శనగా మిగిలిపోతుంది. అంటే, పైకి నీతిమంతుడిలా కనిపించడానికి మాత్రమే ప్రయత్నిస్తూ, లోపల నిజాయితీ లేకుండా ఉండటం. కానీ సంబంధం పట్ల నిజమైన శ్రద్ధతో, పరిస్థితిపై నిజాయితీ అంచనాతో కూడిన నైతికత- అదే వివేకానికి అత్యంత సమీపమైనది. మూడింటినీ ఒకేసారి కాపాడుకోవడంలో వైఫల్యమే.. బంధాలు బీటలువారడానికి కారణం. కొందరికి విధేయత నేర్పారు, అది మౌనంగా ఉండటాన్ని సూచించింది. "పెద్దవాళ్లు చెప్పింది వినాలి, ఎదురు మాట్లాడకూడదు" అని నేర్చుకున్న వారు, తప్పు జరుగుతున్నా నోరు మెదపరు. కొందరికి నిజాయితీ నేర్పారు, అది కొన్నిసార్లు కరుకుదనాన్ని సూచించింది. "ఎప్పుడూ సత్యమే చెప్పాలి" అని నేర్చుకున్నవారు, ఆ నిజం ఎదుటివారిని ఎంత బాధపెడుతుందో ఆలోచించరు. మరికొందరికి సూత్రబద్ధత నేర్పారు, అది కొన్నిసార్లు మొండితనాన్ని సూచించింది. నియమాలను గుడ్డిగా పాటిస్తూ, పరిస్థితులను బట్టి మారే వెసులుబాటును కోల్పోతారు. ఒకటిగా నేర్చుకున్న ప్రతి సుగుణంలో దాని సొంత వక్రీకరణ దాగి ఉంటుంది. జీవితం నిజంగా కోరుకునేది ఈ మూడింటి మధ్య ఎప్పుడు కదలాలో తెలుసుకునే సామర్థ్యం. ఎప్పుడు బంధానికి కష్టమైన సత్యం రక్షణగా అవసరమో, ఎప్పుడు సత్యానికి నైతిక సున్నితత్వం అవసరమో, ఎప్పుడు సంబంధం దెబ్బతిన్నా నైతికతకే ప్రాధాన్యమివ్వాలో గుర్తించడం. ఉదాహరణకు, స్నేహితుడు అడ్డదారి తొక్కాడని తెలిస్తే.. ఆ స్నేహాన్ని కాపాడుకోవడం కంటే నిజాయితీగా హెచ్చరించడమే సరైనది. అక్కడ బంధం కంటే నైతికతకే ప్రాధాన్యమివ్వాలి. ఈ మూడింటిలో దేనినీ మిగతా రెండింటి కోసం శాశ్వతంగా త్యాగం చేయలేం, చేస్తే ఏదో అమూల్యమైనది కోల్పోతాం. దీనికి శ్రద్ధ, వివేచన, సంక్లిష్టతతో సావధానంగా వ్యవహరించే సంసిద్ధత అవసరం. కానీ దీనికి ప్రత్యామ్నాయం- ఈ మూడింటిలో ఒకదానిని ఎంచుకుని మిగతా రెండింటినీ వదిలేయడం. అదే మన చాలా గందరగోళాలకు మూలకారణం. త్రికోణం అనే భావనలో ఉన్న అందమే ఇది. మూడు కోణాలు సమానంగా బలంగా ఉంటేనే ఏ బంధమైనా నిలబడుతుంది, నిలబెడుతుంది!! ■




పాత అలవాట్లు వదలకుండా కొత్త రిజల్ట్స్ ఆశించడం... పాత సిమ్‌తో కొత్త రీచార్జ్ ఆఫర్ కోసం ఎదురుచూసినట్టే! జీవితంలో మార్పు కావాలంటే ముందు మీ "కంఫర్ట్ జోన్" వైఫైని ఆఫ్ చేయాల్సిందే. మీ స్టాండర్డ్స్ పెంచుకున్న క్షణమే, సక్సెస్ మీ డోర్ బెల్ కొడుతుంది- కొరియర్ బాయ్‌లా! మార్పు అంటే - నిన్నటి బద్ధకాన్ని బయటకు తన్ని, కొత్త ఆలోచనకు తలుపు తెరవడమే! అలవాట్లను బద్దలు కొట్టే ధైర్యం చేసినవాడే హీరో అవుతాడు, మిగతావాళ్లు కామెంట్స్‌లో "నైస్" రాస్తూ ఉండిపోతారు! గుర్తుంచుకోండి- మీ స్టాండర్డ్సే మీ భవిష్యత్తుకు ఫౌండేషన్... అదే లేకపోతే, కలల మేడ ఎప్పటికీ కలగానే మిగిలిపోతుంది!

-మహాదేవ

## వింతల్లో వింతలు

# లైసెన్స్ ఇస్తే... డబ్బు వర్షం!



ఇది నిజంగా అమలవుతున్న పథకమే. ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు మాల్టా ప్రభుత్వం వినూత్న ఆలోచనతో ముందుకొచ్చింది. 30 ఏళ్లలోపు యువ డ్రైవర్లు తమ డ్రైవింగ్ లైసెన్స్‌ను ఐదేళ్ల పాటు స్వచ్ఛందంగా అప్పగిస్తే, ఏటా 5,000 యూరోల చొప్పున మొత్తం 25,000 యూరోలు (సుమారు రూ.24 లక్షలు) చెల్లిస్తారు. కనీసం ఏడేళ్లుగా మాల్టాలో నివసిస్తూ, ఏడాది కాలంగా లైసెన్స్ కలిగి ఉన్నవారు మాత్రమే దీనికి అర్హులు. ఈ ఐదేళ్లలో దేశంలోగానీ, విదేశాల్లోగానీ వాహనం నడపడానికి వీల్లేదు. గడువు ముగిశాక లైసెన్స్ తిరిగి పొందాలంటే 15 గంటల డ్రైవింగ్ శిక్షణ తప్పనిసరి. ట్రాన్స్‌పోర్ట్ మాల్టా దీనికి రూ.200 కోట్లకు పైగా బడ్జెట్ కేటాయించింది తెలుసా!

# వైస్ కెప్టెన్‌గా ఎంపికైన వైభవ్ సూర్యవంశీ

భారత యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ మరో అరుదైన గౌరవాన్ని దక్కించుకున్నాడు. జింబాబ్వే పర్యటనలో 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు అందుకున్న కొద్ది రోజులకే, భారత దేశవాళీ క్రికెట్‌లో ప్రతిష్ఠాత్మకమైన దులీప్ ట్రోఫీ 2026 కోసం ప్రకటించిన ఈస్ట్ జోన్ జట్టుకు వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. కేవలం 15 ఏళ్ల వయసులోనే భారత జట్టులో చోటు సంపాదించిన వైభవ్ ఇప్పటివరకు ఎనిమిది ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు మాత్రమే ఆడినా, భారత క్రికెట్ భవిష్యత్తు స్టార్‌గా గుర్తింపు పొందుతున్నాడు.

జూలై 29న ప్రకటించిన 15 మంది సభ్యుల ఈస్ట్ జోన్ జట్టుకు భారత వికెట్‌కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ కెప్టెన్‌గా ఎంపిక కాగా, వైభవ్ సూర్యవంశీకి వైస్ కెప్టెన్ బాధ్యతలు అప్పగించారు.

ఈ జట్టులో భారత స్టార్ పేసర్ మహ్మద్ షమీ, ముకేశ్



కుమార్, షాబాజ్ అహ్మద్, అభిమన్యు ఈశ్వరన్, అనుకుల్ రాయ్, విరాట్ సింగ్ తదితరులు కూడా చోటు దక్కించుకున్నారు.

దులీప్ ట్రోఫీ 2026 ఈస్ట్ జోన్ జట్టు: అభిమన్యు ఈశ్వరన్, సుదీప్ కుమార్ ఘరామి, షాబాజ్ అహ్మద్, సూరజ్ సింధు జైస్వాల్, మహ్మద్ షమీ, ముకేశ్ కుమార్, ఇషాన్ కిషన్ (కెప్టెన్), కుమార్ కుషాగ్ర, శిఖర్ మోహన్, అనుకుల్ రాయ్, విరాట్ సింగ్, సుబ్రాంశు సేనాపతి, వైభవ్ సూర్యవంశీ (వైస్ కెప్టెన్), దెనీష్ దాస్, అభిజిత్ సర్కార్.

స్టాండ్‌బై ఆటగాళ్లు: ఆయుష్ లోహరుకా, శ్రీదామ్ పాల్, సాంబిత్ ఎస్. బరాల్, శరణ్‌దీప్ సింగ్, స్వస్తిక్ సమల్.

కాగా, దులీప్ ట్రోఫీ ఆగస్ట్ 23 నుండి సెప్టెంబర్ 10 వరకు జరుగనుంది. 23నే ప్రారంభం కానున్న తొలి క్వార్టర్ ఫైనల్లో ఈస్ట్ జోన్ జట్టు నార్త్ ఈస్ట్ జోన్‌తో తలపడనుంది. ఆగస్ట్ 15 నుండి 27 మధ్యలో టీమిండియా శ్రీలంక పర్యటనలో రెండు టెస్ట్ మ్యాచ్‌లు ఆడనున్నప్పటికీ.. టెస్ట్ జట్టులో ఇషాన్, వైభవ్‌కు చోటు దక్కని విషయం తెలిసిందే.

# బంగ్లాదేశ్‌కు కొత్త కెప్టెన్

2027 ఐసీసీ వన్డే ప్రపంచకప్‌కు ముందు బంగ్లాదేశ్ క్రికెట్ జట్టులో కీలక మార్పు చోటుచేసుకుంది. వన్డే జట్టుకు కొత్త కెప్టెన్‌గా సీనియర్ బ్యాటర్ లిట్టన్ దాస్ నియమితుడయ్యాడు. ఈ విషయాన్ని ఆ దేశ క్రికెట్ బోర్డు అధికారికంగా ప్రకటించింది. ఇటీవలి కాలంలో మెహిదీ హసన్ మిరాజ్ సారథ్యంలో జట్టు ఆశించిన ఫలితాలు సాధించకపోవడంతో నాయకత్వంలో మార్పు చేయాలని బోర్డు నిర్ణయించింది.

లిట్టన్ దాస్‌కు నాయకత్వ అనుభవం కూడా బాగానే ఉంది. గతంలో బంగ్లాదేశ్ వన్డే జట్టుకు తాత్కాలిక కెప్టెన్‌గా వ్యవహరించిన ఆయన, 2021 నుంచి 2026 వరకు టీ20 జట్టుకు పూర్తి స్థాయి కెప్టెన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. ఒక టెస్టులో కూడా జట్టును నడిపించాడు.


ఈ ఏడాది డిసెంబరులో దక్షిణాఫ్రికా పర్యటనలో జరిగే వన్డే సిరీస్ నుంచి లిట్టన్ దాస్ అధికారికంగా కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టనున్నాడు. దాస్ వన్డే, టీ20 జట్లకు నాయకత్వం వహించనుండగా.. నజ్ముల్ హసన్ షాంటో టెస్ట్ జట్టు సారథిగా ఉన్నాడు. బంగ్లాదేశ్ తాజాగా జింబాబ్వే



పర్యటనలో ఘోరంగా విఫలమైన విషయం తెలిసిందే. ఆగస్ట్‌లో ఈ జట్టు ఆస్ట్రేలియాలో రెండు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్ ఆడనుంది.

## స్పోర్ట్స్

# ఐపీఎల్ బిజినెస్ విలువ 20 బిలియన్ డాలర్లు.. టాప్ బ్రాండ్‌గా ఆర్సీబీ



ఇండియన్ ప్రీమియర్ లీగ్ విలువ తొలిసారి 20 బిలియన్ డాలర్ల (1.9 లక్షల కోట్లు) మార్క్‌ను దాటేసింది. అదే విధంగా ఐపీఎల్ (ఇలా 2026)లో టాప్ బ్రాండ్‌గా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు నిలిచింది. వరుసగా రెండు సీజన్లలో కప్పును సొంతం చేసుకున్న ఆర్సీబీ తన మార్కెట్‌ను పెంచుకుంది. ప్రస్తుతం ఆర్సీబీ విలువ 300 మిలియన్ డాలర్లకుపైగా ఉంది. 2026లో ఐపీఎల్ విలువను హౌలిహాన్‌లోకి స్టడీ చేసి నివేదికను విడుదల చేసింది. గతేడాదితో పోలిస్తే లీగ్ బిజినెస్ విలువ 11.4 శాతం పెరిగినట్లు పేర్కొంది.

మూడేళ్ల కిందట ఐపీఎల్ బిజినెస్ విలువ 15.4 బిలియన్ డాలర్లు (రూ.1.47 లక్షల కోట్లు) ఉండేది.

2025 నాటికి 18.5 బిలియన్ డాలర్లు (రూ. 1.75 లక్షల కోట్లు)

ఈ ఏడాది ఐపీఎల్ బిజినెస్ విలువ 20.6 బిలియన్ డాలర్లు (రూ. 1.90 లక్షల కోట్లు)కు పెరిగింది.

మీడియా హక్కులు, స్పాన్సర్‌షిప్‌లు, టికెట్ల విక్రయాలు కలిపి మొత్తం ఆదాయం 1.8 బిలియన్ డాలర్లు (రూ. 1.70 లక్షల కోట్లు) దాటిందని నివేదిక అంచనా వేసింది.

విలువ పరంగా తొలి స్థానంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఉండగా.. ఆ తర్వాత వరుసలో ముంబయి ఇండియన్స్, కోల్‌కతా నైట్‌రైడర్స్, చెన్నై సూపర్ కింగ్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్, పంజాబ్ కింగ్స్, గుజరాత్ టైటాన్స్, ఢిల్లీ క్యాపిటల్స్, లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ ఉన్నాయి.


# ఫ్యాషన్ ఐకాన్ ఫరియా అబ్దుల్లా కిల్లర్ లుక్

ఫ్యాషన్ ఐకాన్ ఫరియా అబ్దుల్లా కిల్లర్ లుక్

కేవలం ఐదేళ్లలో ఇండస్ట్రీలో ఎంతో తెలివిగా సెలక్టివ్ గా కెరీర్ బండిని నడిపిస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది ఈ భామ. పూర్తి వివరాల్లోకి వెళితే..చిట్టి ఫరియాగా తెలుగు వారి గుండెల్లో స్థిరపడిపోయింది ఫరియా అబ్దుల్లా. కేవలం ఐదేళ్లలో ఇండస్ట్రీలో ఎంతో తెలివిగా సెలక్టివ్ గా కెరీర్ బండిని నడిపిస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది ఈ భామ. పూర్తి వివరాల్లోకి వెళితే..



టాలీవుడ్ యంగ్ అండ్ డైనమిక్ బ్యూటీ ఫరియా అబ్దుల్లా గ్లామర్ అండ్ ఫ్యాషన్ ప్రపంచంలో ఎప్పుడూ తనదైన మార్కును చూపిస్తూనే ఉంటుంది. ఇటీవల -డాన్స్ ఐకాన్ సీజన్ 2- వేదికపై ఈ భామ ధరించిన కస్టమ్ మేడ్ డెనిమ్ చీర సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. సాంప్రదాయ చీరకట్టుకి భిన్నంగా... స్ట్రీట్‌వేర్ యాటిట్యూడ్‌తో డెనిమ్ మెటీరియల్.. బూట్స్ -బెల్ట్‌లతో ఐశ్వర్య డిజైన్ చేసిన ఈ ఫ్యూజన్ లుక్ ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంది. శక్తి స్మరణ్ ఫోటోగ్రఫీ, అనుషా అలీ మేకప్‌లో ఫరియా సరికొత్త ఫ్యాషన్ ట్రెండ్‌ను క్రియేట్ చేసిందంటూ నెటిజన్లు కామెంట్ల రూపంలో ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. చిట్టి కిల్లర్ లుక్ అదిరిపోయిందంటూ కితాబు దక్కింది.ఫరియా అబ్దుల్లా 2026లో కూడా వరుస సినిమాలతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ ఏడాది -అనగనగా ఒక రాజు- చిత్రంలో పీతాంబరిగా కామియో పాత్రలో మెరవగా, -గాయపడ్డ సింహం- చిత్రంలో షాలిని అనే బలమైన పాత్రతో అలరించింది.



వీటితో పాటు తమిళ-తెలుగు ద్విభాషా చిత్రంగా తెరకెక్కుతున్న -సిగ్మా-లోనూ ఫరియా కీలక పాత్ర పోషిస్తోంది. నటనలోనే కాకుండా డాన్స్, పాటల రచన, సింగింగ్‌లోనూ ప్రయోగాలు చేస్తూ తన బహుముఖ ప్రజ్ఞను నిరూపించుకుంటోంది. ప్రత్యేకించి ఫరియా నటిస్తున్న -సిగ్మా- సినిమా ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకుని విడుదలకి సిద్ధమవుతోంది. ఈ తమిళ-తెలుగు ద్విభాషా యాక్షన్ థ్రిల్లర్ లో ఫరియా అబ్దుల్లాతో పాటు సౌత్ ఇండస్ట్రీకి చెందిన ప్రముఖ నటీనటులు సాంకేతిక నిపుణులు పని చేస్తున్నారు. ఒక సరికొత్త కాన్సెప్ట్, సమాజంలో వైవిధ్యమైన నేపథ్యం ఉన్న పాత్రల చుట్టూ తిరిగే కథాంశంతో ఈ చిత్రం రూపుదిద్దుకుందని తెలుస్తోంది. ఈ చిత్రం ద్వారా తమిళంలో కూడా ఫరియా బలమైన పునాది వేసుకోవాలని భావిస్తోంది.

### ఈ ఐదేళ్లలో సాధించింది ఏమిటి?

2021లో వచ్చిన బ్లాక్‌బస్టర్ హిట్ -జాతి రత్నాలు- సినిమాలో -చిట్టి- (అడ్వకేట్ షామిలి) పాత్రతో కెరీర్ ప్రారంభించిన ఫరియా.. ఈ ఐదేళ్ల కాలంలో సుమారు ఏడెనిమిది సినిమాలలో నటించింది. మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్, బంగార్రాజు, లైక్ షేర్ ఊ సబ్‌స్క్రైబ్, రావణాసుర, ఆ ఒక్కటీ అడక్కు, కల్కి 2898 ఏడీ, మత్తు వదలరా 2, గుర్రం పాపిరెడ్డి.. ఇలా వరుస అవకాశాలు దక్కించుకుంది. నటిగా మాత్రమే కాకుండా కొరియోగ్రాఫర్‌గా, లిరిసిస్ట్‌గా, సింగర్‌గా కూడా తన ప్రతిభను చాటుకుంది. తొలి చిత్రంతోనే విశేష గుర్తింపు తెచ్చుకుని... ఐదేళ్లలో ఇన్ని విభిన్నమైన ప్రాజెక్ట్‌లలో భాగమవ్వడం ఒక నటిగా గొప్ప విషయమేనని చెప్పవచ్చు. అయితే ఫరియాలో ఉన్న అపారమైన ప్రతిభ, స్క్రీన్ ప్రెజెన్స్, కమాండింగ్ పర్సనాలిటీకి తగినట్లుగా పరిశ్రమలో తనకు మరింత పెద్ద అవకాశాలు, సోలో హిట్ చిత్రాలు రావాల్సి ఉందనేది విశ్లేషకులు-అభిమానుల అభిప్రాయం. కేవలం కామియోలు, సెకండ్ లీడ్ లేదా సపోర్టింగ్ పాత్రలకే పరిమితం చేయకుండా... తనలోని పూర్తి స్థాయి నటిని బయటకు తీసే విధంగా ప్రధాన పాత్రలతో కూడిన లీడ్ ఆఫర్లు ఇస్తే ఫరియా స్టార్ గా తన స్థానాన్ని మరింత పటిష్టం చేసుకునే అవకాశం ఉంది.



ప్రతి లుక్‌ని ఎలా రాక్ చేయడం శ్రీముఖికి తెలుసు

జాన్వీ కపూర్ ఫ్యాషన్ మీరు స్టార్లను చూస్తారు

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com